www.aashwi.net / in PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

శుక్రవారం, 05-06-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :36 Issue : 36 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## రెండు సంవత్సరాల పాలన పై సుదీర్ఘ చర్చలు



**ఆంధ్రప్రదేశ్, ఆశ్వి అప్డేట్**

ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి అధ్యక్షతన ఆయన నివాసంలో జరుగుతున్న ఎన్డీఏ కూటమి పార్టీల సమన్వయ సమావేశంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనతో పాటు పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు . ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పి.వి.ఎన్. మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## మక్తల్ కు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ఆశ్వి అప్డేట్, నారాయణపేట జూన్ 4**

మక్తల్ లో HCM రేవంత్ రెడ్డి కి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి స్వాగతం పలుకుతున్న నారాయణపేట జిల్లా కలెక్టర్ C.h. ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, మంత్రి వాకిటి శ్రీహరి,

# పల్లెల్లో ఇందిరమ్మ లొల్లి



- గ్రామాల్లో సెగ రేపుతున్న లబ్ధిదారుల ఎంపిక
- కాంగ్రెస్ నేతల్లోనే అంతర్గత కుమ్ములాటలు
- డిమాండ్‌కు సరిపోని ఇళ్ల కోటా
- అధికార పార్టీలో అసంతృప్తి స్వరాలు
- ప్రతిపక్షాలకు దొరికిన కొత్త అస్త్రం

**హైదరాబాద్, జూన్ 4, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ చర్చకు దారితీస్తోంది. నిరుపేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చే లక్ష్యంతో అమలవుతున్న ఈ పథకానికి ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తున్నప్పటికీ, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పలు గ్రామాల్లో వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు స్థానిక అధికార యంత్రాంగం కూడా ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం పథకం రెండో విడత అమలు కొనసాగుతోంది. మొదటి విడతలో నియోజకవర్గాల వారీగా వేల సంఖ్యలో ఇళ్లు మంజూరు చేసినప్పటికీ, గ్రామాల వారీగా చూస్తే

మిగతా 2వ పేజీలో..





## రాజ్యసభ బరిలో బీజేపీ అభ్యర్థులు

- కీలక నేతలకు అవకాశం.. తరుణ్ చుగ్, సతీశ్ పూనియాలకు టికెట్లు
- ఒడిశాలో దేవాశిష్ సామంత్రాయ్‌కు ఛాన్స్
- ఈనెల 18న రాజ్యసభ ఎన్నికలు

5

## చార్మినార్ వద్ద కేటీఆర్ సందడి



- నిమ్రా కేఫ్‌లో ఇరానీ చాయ్,
- ఉస్మానియా బిస్కెట్ల రుచి
- పాతబస్తీ పర్యటనకు సంపూర్ణత్వం ఇరానీ చాయ్‌తోనే
- ఎక్స్ వేదికగా కేటీఆర్ వ్యాఖ్యలు

2



## పోలవరంతో భద్రాచలానికి ముంపు ప్రమాదం

- గ్రామాలు, పరిశ్రమలకు జలగండమే
- ముంపు బాధితులకు తక్షణం నష్టపరిహారం చెల్లించాలి
- శాశ్వత పునరావాసం కల్పించాలి
- పీపీఏ సీఈఓకు మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ

2



## కీలక ఖనిజాల అబ్జర్వేటరీ శాటిలైట్ కేంద్రం ప్రారంభం

- భారత్‌యూకే భాగస్వామ్యంలో మరో కీలక మైలురాయి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**న్యూఢిల్లీ, జూన్ 4, ఆశ్వి అప్డేట్స్ :**

భారత్‌యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) మధ్య క్రిటికల్ మినరల్స్ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యం మరో కీలక మైలురాయి చేరుకుంది. 2025లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ద్వైపాక్షిక భేటీ సందర్భంగా

మిగతా 2వ పేజీలో..

## హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

- సూడాన్ నుంచి వచ్చిన ప్రయాణికుడిలో లక్షణాల గుర్తింపు
- గాంధీ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డుకు తరలింపు
- నిర్ధారణ కోసం సీసీఎంబీకి శాంపిల్స్ పంపిన వైద్యులు




**హైదరాబాద్, జూన్ 4, ఆశ్వి అప్డేట్స్:**

శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎబోలా వైరస్ అనుమానిత కేసు కలకలం రేపింది. సూడాన్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ విదేశీ ప్రయాణికుడిలో ఎబోలా లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. విమానాశ్రయంలో నిర్వహించిన ఆరోగ్య పరీక్షల్లో ముహమ్మద్ అనే ప్రయాణికుడికి ఎబోలా వైరస్‌కు సంబంధించిన లక్షణాలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. దీంతో అతడిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో

మిగతా 2వ పేజీలో..

## గంజాయి రవాణాపై ఈగిల్ కొరడా

- అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు
- 12.739 కిలోల ప్రీమియం హైడ్రోపోనిక్ గంజాయి స్వాధీనం
- థాయ్‌లాండ్–హైదరాబాద్–ముంబై కేంద్రాలుగా నెట్‌వర్క్
- 40 మంది నిందితుల గుర్తింపు

**హైదరాబాద్, జూన్ 4, ఆశ్వి అప్డేట్స్:**

మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై రాష్ట్ర ఈగిల్ ఫోర్స్ ఉక్కుపాదం మోపింది. థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు హైడ్రోపోనిక్ గంజాయిని

మిగతా 2వ పేజీలో..



## అమీర్‌పేట్‌లో భారీ అగ్నిప్రమాదం

- సమీప దుకాణాలకు వ్యాపించిన అగ్నికీలలు
- రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది
- ప్రమాద కారణాలపై దర్యాప్తు

**హైదరాబాద్, జూన్ 4, ఆశ్వి అప్డేట్స్:**

హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ ప్రాంతంలో గురువారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మైత్రివనం ఎదురుగా ఉన్న

మిగతా 2వ పేజీలో..



## రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచం: పొంగులేటి

- భూముల విలువలపై సందేహాలకు టోల్‌ఫ్రీ, వాట్సాప్ నంబర్లు
- రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చాం
- ఫ్యూచర్ సిటీ రద్దు చేసే ప్రసక్తే లేదు

2

## మెట్రో వ్యవస్థకు ఎలాంటి నష్టం లేదు..

- అమీర్‌పేట అగ్నిప్రమాదంపై స్పందించిన హెచ్ఎంఆర్ఎల్ ఎండీ
- మెట్రో స్తంభాలకు ఎలాంటి నష్టం జరగలేదన్న అధికారులు
- కాలిపోయింది వినైల్ షీట్లే..
- పుకార్లను ఖండించిన మెట్రో యాజమాన్యం
- పొగతో ప్రయాణికులకు ఇబ్బంది.. యథావిధిగా కొనసాగిన మెట్రో సర్వీసులు

**హైదరాబాద్,జూన్ 4,ఆశ్వి అప్డేట్స్**


హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ మైత్రివనం సమీపంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంపై హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (HMRL) ఉన్నతాధికారులు కీలక ప్రకటన చేశారు. ఈ ప్రమాదం కారణంగా పక్కనే ఉన్న మెట్రో రైలు వ్యవస్థకు ఎలాంటి నష్టం జరగలేదని హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సర్ఫరాజ్ అహ్మద్ స్పష్టం చేశారు.

మిగతా 2వ పేజీలో..



## లాసెట్‌లో మాజీ మావోయిస్టు నేత ప్రతిభ

**50 ఏళ్లు దాటినా చదువుపై పట్టుదల**



TG LAWCET- 2026 :: RANK CARD
OSMANIA UNIVERSITY, HYDERABAD

LL.B. 5 YDC | Hall Ticket Number 22632201608

T THIRUPATHI
T VENKAT NARSAIAH
GANGAMMA
09/06/1965
SC (GROUP-III)
NA
MALE
LOCAL ( OU AREA I.E. TELANGANA STATE)

Five * Seven | Marks | 57
Three * Four * Nine | Rank in Figure | 349
QUALIFIED

- రాష్ట్ర స్థాయిలో 349వ ర్యాంకు సాధించిన దేవ్‌జీ
- లాయర్‌గా మారి పేదలకు సేవ చేయడమే లక్ష్యం
- న్యాయ విద్య వైపు మాజీ మావోయిస్టు అగ్రనేత అడుగులు

2

## అంగన్‌వాడీలకు సెలవుల పొడిగింపు

2

# గంజాయి రవాణాపై ఈగిల్ కొరడా

**మొదటిపేజీ తరవాయి**

అక్రమంగా తరలిస్తున్న అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాను ఛేదించి భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకుంది. కస్టమ్స్ అధికారులు, పోలీసుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్‌లో 12.739 కిలోల ప్రీమియం హైడ్రోపోనిక్ గంజాయిని పట్టుకున్నారు. దర్యాప్తులో థాయ్‌లాండ్, హైదరాబాద్, ముంబై కేంద్రాలుగా భారీ నెట్‌వర్క్ నడుస్తున్నట్లు గుర్తించారు. మూడొందల మంది క్యారియర్లను వినియోగించి థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు అధిక టిహెచ్‌సీ శాతం కలిగిన గంజాయిని తరలించినట్లు ఈగిల్ ఫోర్స్ వెల్లడించింది. గతంలో అరుదైన వస్తువుల స్మగ్లింగ్‌లో పాల్గొన్న ఈ ముఠా 2023 నుంచి మాదకద్రవ్యాల రవాణాపై దృష్టి సారించినట్లు గుర్తించారు. 2026 ఏప్రిల్ 8న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బ్యాంకాక్ నుంచి వచ్చిన సోధా మొహసన్ బహదూర్ భాయ్ వద్ద 13.2 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

అనంతరం రాచకొండ పోలీసులు, కస్టమ్స్ అధికారుల సంయుక్త దర్యాప్తులో హరషద్ మన్‌సుఖ్ భాయ్ ప్రజాపతి, సందీప్ వాసాని అలియాస్ రాహుల్ జైన్‌లను అరెస్టు చేసి మరో 12.739 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గుజరాత్‌కు చెందిన దల్ అబ్దుల్లా సదుద్దీన్ నాయ్ యువకులను ప్రలోభపెట్టి గంజాయి రవాణాకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ముంబైకి చెందిన హేమంగ్ ప్రమోద్ కెలుస్కర్, అతని సోదరుడు సుధాంశు కెలుస్కర్ ఈ రాకెట్ ప్రధాన సూత్రధారులుగా విచారణలో తేలింది. థాయ్‌లాండ్‌లో క్లబ్ వ్యాపారాన్ని అడ్డాగా చేసుకుని స్మగ్లింగ్ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో మొత్తం 40 మంది నిందితులను గుర్తించగా, పలువురిని అరెస్టు చేశారు. మరికొందరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే 1908 నంబర్‌కు లేదా ఈగిల్ ఫోర్స్ అధికారిక మార్గాల ద్వారా తెలియజేయాలని అధికారులు ప్రజలను కోరారు.

# రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచం: పొంగులేటి

**హైదరాబాద్, జూన్ 4, ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజలపై అదనపు భారం పడకూడదనే ఉద్దేశంతో రిజిస్ట్రేషన్ ఫీజులను యథాతథంగా కొనసాగిస్తున్నామని తెలిపారు.

గచ్చిబౌలిలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడారు. భూముల విలువలను శాస్త్రీయ పద్ధతిలో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సవరించామని, సవరించిన విలువలపై అభ్యంతరాలు, సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ *1800 599 4788, వాట్సాప్ నంబర్ **8247619983*కు తెలియజేయవచ్చని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల కనీస విలువను ఎకరానికి రూ.2.75 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.5 లక్షలు, హెచ్ఎండీఏ పరిధిలో రూ.10 లక్షలు, ఓఆర్ఆర్ పరిధిలో రూ.15 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న సుమారు 3,500 ఫైళ్లను పరిష్కరించామని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భూములకు సంబంధించిన అన్ని రికార్డులను డిజిటలైజేషన్ చేయనున్నట్లు వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు రద్దు చేసే అవకాశం లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించేందుకు అత్యాధునిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని, మొదటి దశలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 13 క్లస్టర్లుగా ఈ భవనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



# అమీర్‌పేట్‌లో భారీ అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

కేఎస్ఆర్ ఫ్యాషన్స్ భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

భవనం నుంచి ఎగిసిపడిన అగ్నికీలలు వేగంగా వ్యాపించడంతో సమీపంలోని దుకాణాలకు కూడా మంటలు అంటుకున్నాయి. మంటలు క్రమంగా విస్తరిస్తుండటంతో వ్యాపారులు, స్థానిక ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతంలో కొంతసేపు ట్రాఫిక్ రద్దీ నెలకొంది. భద్రతా చర్యల్లో భాగంగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఈ ప్రమాదంలో ఎవరైనా గాయపడ్డారా, ప్రాణనష్టం జరిగిందా అనే విషయాలపై ఇంకా స్పష్టత రాలేదు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత ప్రమాదానికి దారితీసిన కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టనున్నారు.




# కీలక ఖనిజాల అబ్జర్వేటరీ శాటిలైట్ కేంద్రం ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

క్రిటికల్ మినరల్స్ సప్లై చైన్ అబ్జర్వేటరీ ఏర్పాటు చేస్తామని చెప్పిన నేపథ్యంలో తాజాగా ఈ కేంద్రం ప్రారంభమైంది. భారత్‌యూకే క్రిటికల్ మినరల్స్ గ్లోబల్ సప్లయ్ చైన్ అబ్జర్వేటరీ (జీఎస్‌సీవో) శాటిలైట్ కేంద్రాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి యూకే ఫారిన్ సెక్రటరీ ఇవెట్ కూపర్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సురక్షితమైన, స్థిరమైన, విశ్వసనీయమైన క్రిటికల్ మినరల్స్ సప్లయ్ చైన్ వ్యవస్థ నిర్మాణంలో ఈ అబ్జర్వేటరీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. క్లీన్ ఎనర్జీ, ఆధునిక సాంకేతికతలు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో క్రిటికల్ మినరల్స్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు వెన్నెముకగా మారుతున్నాయని, ప్రపంచంలోని అతిపెద్ద డిజిటల్ మెటీరియల్ ఫ్లో మ్యాప్ రూపకల్పనలో ఈ అబ్జర్వేటరీ ముఖ్య కేంద్రంగా నిలవనుందని వివరించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో క్రిటికల్ మినరల్స్ రంగంలో స్వావలంబనకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఈ లక్ష్యంతోనే 4 బిలియన్ డాలర్ల జాతీయ క్రిటికల్ మినరల్స్ మిషన్‌ను ప్రారంభించామని తెలిపారు. మినరల్స్ వెలికితీత, ఎక్స్‌ప్లోరేషన్, ప్రాసెసింగ్, రీసైక్లింగ్, ఇన్నొవేషన్స్ వంటి విషయాల్లో వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ఈ మిషన్ ప్రధాన ఉద్దేశమన్నారు. క్రిటికల్ మినరల్స్ రీసైక్లింగ్‌ను ప్రోత్సహించేందుకు 180 మిలియన్ డాలర్ల ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తున్నామని, దేశవ్యాప్తంగా తొమ్మిది సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. పారిశ్రామిక వ్యర్థాల నుంచి విలువైన మినరల్స్, విదేశాల్లో మినరల్స్‌ను తవ్వడం వంటి చర్యలు చేపడుతున్నామని, మినరల్స్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక విధానపరమైన సంస్కరణలు చేపడుతోందని ఆయన చెప్పారు. పారదర్శకంగా ఈఆక్షన్, ప్రైవేట్ కంపెనీలకు ప్రోత్సాహం అందించడంతోపాటు, జూనియర్ మైనింగ్ కంపెనీలకు అవకాశాలు కల్పిస్తోందన్నారు. వేగవంతంగా అనుమతులు అందిస్తూ మినరల్స్ రంగంలో పెట్టుబడులకు ప్రపంచంలోనే అత్యంత అనుకూలమైన దేశంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. బ్రిటిష్ పరిశ్రమలు, పెట్టుబడిదారులు, సాంకేతికరంగ సంస్థలు భారత క్రిటికల్ మినరల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యూకేకు ఉన్న మినరల్ ప్రాసెసింగ్, ఎక్స్‌ట్రాక్షన్ టెక్నాలజీ భారత దేశంలోని ఎలక్ట్రిక్ వాహనాలు, డిఫెన్స్, ఏరోస్పేస్, సెమీ కండక్టర్ రంగాల వేగవంతమైన అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. భవిష్యత్తులో ఈ అబ్జర్వేటరీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన క్రిటికల్ మినరల్ ఇంటెలిజెన్స్ కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభ్యావం వ్యక్తం చేశారు. పరిశ్రమలు, పరిశోధకులు, పెట్టుబడిదారులకు ఈ అబ్జర్వేటరీ విలువైన సమాచారం అందిస్తుందన్నారు. కేంద్ర గనుల శాఖ, ఐఐటీ (ఐఎస్ఎం) ధన్‌బాద్, టెక్స్‌మిన్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలోని టెక్నాలజీ ట్రాన్స్‌లేషన్ రీసెర్చ్ పార్క్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో యూకే విదేశాంగ శాఖ ప్రతినిధులు, బ్రిటిష్ హై కమిషన్ అధికారులు, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ప్రతినిధులు, ఐఐటీ (ఐఎస్ఎం) ధన్‌బాద్, టెక్స్‌మిన్, కేంద్ర గనుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోలవరంతో భద్రాచలానికి ముంపు ప్రమాదం

**హైదరాబాద్, జూన్ 4, ఆశ్వి అప్డేట్స్:**

పోలవరం పూర్తి స్థాయి నీటి మట్టం 45.72 మీటర్లు కాగా, భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి కూడా సరిగ్గా అదే 45.72 మీటర్లు కావడం గమనార్హం.. దీంతో ప్రాజెక్టు పూర్తయితే భద్రాచలానికి ఎల్లప్పుడూ ముంపు ప్రమాదం పొంచివుంటుందని బీఆర్ ఎస్ నేత హరీశ్‌రావు, పీపీఏ సీఈఓకు రాసిన లేఖలో వెల్లడించారు. భద్రాచలం వద్ద గోదావరి నది లోతైన బెడ్ లెవల్ 26 మీటర్లు కాగా, పోలవరం పూర్తయితే బ్యాక్ వాటర్ ప్రభావంతో భద్రాచలంలో ఎప్పుడూ 13.15 మీటర్ల నుంచి 17.72 మీటర్ల మేర నీరు నిలిచి ఉంటుందన్నారు. 2021లో కాఫర్ డ్యామ్ పూర్తయిన తర్వాత వచ్చిన బ్యాక్ వాటర్‌తో 2022లో భద్రాచలం, బూర్గంపాడు, సారపాకల్లో భారీ నష్టం వాటిల్లడమే కాకుండా, భద్రాచలం పట్టణం 40 శాతం జలమయమై, లక్ష మందికి పైగా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. 2022లో 22 లక్షల క్యూసెక్కులకే ఇంత నష్టం జరిగితే, భవిష్యత్తులో ప్రాజెక్టు డిజైన్ ప్రకారం 36 లక్షల నుంచి 50 లక్షల క్యూసెక్కుల వరద వస్తే తెలంగాణకు ఊహించని ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. కేవలం గ్రామాలకే కాకుండా భారీ పరిశ్రమలకు కూడా బ్యాక్ వాటర్ ముప్పు పున్నదన్నారు. దాదాపు 5 వేల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఐటీసీ పేపర్ బోర్డ్స్, హెవీ వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం జలవిద్యుత్ ప్రాజెక్టులకు అనుక్షణం ప్రమాదం పొంచి వుంటుందన్నారు. ఈ పరిశ్రమలతో పాటు 36 గ్రామాల పరిధిలోని 184 చదరపు కిలోమీటర్ల మేర ముంపు ప్రభావం పడుతోందని ఐఐటీ, వ్యాప్కోస్ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ముంపు వల్ల పదే పదే నష్టపోతున్న సుమారు 2,000 కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారంతో పాటు పూర్తి స్థాయి పునరావాసం కల్పించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భద్రాచలం డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానంగా ఉన్న 8 అవుట్ ఫాల్ రెగ్యులేటర్లు బ్యాక్ వాటర్ ముప్పును ఎదుర్కొంటున్నాయి, కాబట్టి వరద నీటిని గోదావరిలోకి పంపేందుకు తక్షణమే పంపింగ్ స్టేషన్లు, ట్రీట్మెంట్ ప్లాంట్లు నిర్మించాలని కోరారు. భద్రాచలం వద్ద కొత్తగా 5 కిలోమీటర్ల మేర కరకట్టల నిర్మాణం చేపట్టడంతో పాటు, బూర్గంపాడు, సారపాక తదితర ముంపు గ్రామాలకు రక్షణ గోడలు నిర్మించి పరిహారం అందించాలని కోరారు. తెలంగాణలో పోలవరం ముంపు సమస్యల పరిష్కారం, పునరావాస పనుల పర్యవేక్షణ కోసం భద్రాచలంలో వెంటనే ప్రత్యేకంగా పీపీఏ డివిజన్ ఆఫీసును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# మెట్రో వ్యవస్థకు ఎలాంటి నష్టం లేదు..

**మొదటిపేజీ తరువాయి**

మెట్రో రైలు సర్వీసులు ఎప్పటిలాగే పూర్తి సురక్షితంగా, సాధారణంగా పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే మెట్రో సిబ్బంది అప్రమత్తమై ప్రభావితమైన ఆస్తులపై లోతైన అంచనా వేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో దట్టమైన పొగ వ్యాపించడం వల్ల ప్రయాణికులకు కొంత అసౌకర్యం కలిగిన మాట వాస్తవమేనని, అయితే దీనివల్ల మెట్రో రైలు కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలగలేదని, రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయని ఎండీ వివరించారు. కొన్ని మీడియా సంస్థల్లో వస్తున్న పుకార్లపై ఆయన స్పందిస్తూ.. మెట్రో స్తంభాలపై (పిల్లర్లపై) అమర్చిన ప్రకటనల బోర్డుల వినైల్ షీట్లు మాత్రమే మంటల తీవ్రతకు కాలిపోయాయని, అంతకుమించి మెట్రో వ్యవస్థ యొక్క ప్రధాన నిర్మాణాలు, కట్టడాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని స్పష్టం చేశారు. అందువల్ల మెట్రో ప్రయాణికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మెట్రో ప్రయాణం పూర్తిగా సురక్షితమని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ శ్రీ సర్ఫరాజ్ అహ్మద్ భరోసా ఇచ్చారు.

# అంగన్‌వాడీలకు సెలవుల పొడిగింపు

**హైదరాబాద్, జూన్ 4, ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను జూన్ 13 వరకు పొడిగించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓఝ, మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 14 ఆదివారం కావడంతో జూన్ 15 నుంచి కేంద్రాలు తిరిగి ప్రారంభమవుతాయి.


రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల వరకు నమోదవుతుండటంతో చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యే చిన్నారులు వడదెబ్బ, డీహైడ్రేషన్ వంటి సమస్యలకు గురయ్యే అవకాశం ఉండటంతో ముందుజాగ్రత్త చర్యగా సెలవులను పొడిగించారు.

అయితే గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాలకు ఎలాంటి అంతరాయం ఉండదని అధికారులు తెలిపారు. సంబంధిత సేవలను ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

**మొదటిపేజీ తరువాయి**

ఉంచారు. నిర్ధారణ పరీక్షల కోసం అతడి శాంపిల్స్‌ను సీసీఎంబీకి పంపినట్లు అధికారులు తెలిపారు. పరీక్షల ఫలితాలు వచ్చే వరకు వైద్య పర్యవేక్షణలో ఉంచినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఎబోలా అనుమానిత లక్షణాలతో వ్యక్తిని గుర్తించడం ఇదే తొలిసారి కావడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఇదిలా ఉండగా, మధ్య ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి కొనసాగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు జాగ్రత్త చర్యలు చేపట్టింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై విమానాశ్రయాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే వారిని క్షుణ్ణంగా పరీక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రయాణికుడికి నిజంగా ఎబోలా వైరస్ సోకిందా లేదా అనేది పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఆరోగ్య శాఖ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం.



# లాసెట్‌లో మాజీ మావోయిస్టు నేత ప్రతిభ

**జగిత్యాల, జూన్ 4, ఆశ్వి అప్డేట్స్:**

మావోయిస్టు ఉద్యమ పంథాను వీడి విద్యను ఆయుధంగా ఎంచుకున్న మాజీ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ లాసెట్‌లో ప్రతిభ చాటారు. ఇటీవల విడుదలైన లాసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 349వ ర్యాంకు సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు.

జగిత్యాల జిల్లాకు చెందిన దేవ్‌జీ గత నెల 12న కోరుట్లలో నిర్వహించిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా రాశారు. 50 ఏళ్లు దాటిన వయసులోనూ చదువుపై ఆసక్తి కోల్పోకుండా పట్టుదలతో కృషి చేసి లాసెట్‌లో మెరుగైన ర్యాంకు సాధించడం విశేషంగా నిలిచింది.

న్యాయ విద్యను అభ్యసించి భవిష్యత్తులో న్యాయవాదిగా మారాలని, పేదలు, నిరుపేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే తన లక్ష్యమని దేవ్‌జీ తెలిపారు.

ఒకప్పుడు అడవుల్లో ఉంటూ ప్రజా సమస్యల కోసం పోరాడిన ఆయన, ఇప్పుడు చట్టబద్ధ మార్గంలో కోర్టుల ద్వారా ప్రజల పక్షాన నిలబడాలని నిర్ణయించుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. సమాజంలో మార్పు కోసం విద్యనే సాధనంగా ఎంచుకున్న దేవ్‌జీ విజయం యువతతో పాటు చదువుపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# చార్మినార్ వద్ద కేటీఆర్ సందడి

**హైదరాబాద్, జూన్ 5:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం పాతబస్తీ పర్యటనలో భాగంగా చార్మినార్ సమీపంలోని ప్రముఖ నిమ్రా కేఫ్ అండ్ బేకరీని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రసిద్ధ ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్లను ఆస్వాదించారు.

అనంతరం ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్, హైదరాబాద్ పాతబస్తీకి వెళ్లినప్పుడు అక్కడి ఇరానీ చాయ్ తాగకపోతే ఆ పర్యటనకు సంపూర్ణత్వం ఉండదని పేర్కొన్నారు. చార్మినార్ పక్కనే ఉన్న నిమ్రా కేఫ్‌ను సందర్శించి అక్కడి ప్రత్యేక రుచులను ఆస్వాదించడం ఆనందంగా అనిపించిందని తెలిపారు.

కేటీఆర్ రాకతో చార్మినార్ పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఆయనను చూసేందుకు అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.

# పల్లెల్లో ఇందిరమ్మ లొల్లి

**మొదటిపేజీ తరువాయి**

కోటా పరిమితంగానే ఉంది. ఒక గ్రామంలో వందలాది మంది అర్హులు దరఖాస్తు చేసుకుంటే, కొద్దిమందికే అవకాశం దక్కుతుండటంతో అసంతృప్తి పెరుగుతోంది. దీంతో ఎవరికి ఇల్లు మంజూరు చేయాలనే అంశం గ్రామాల్లో పెద్ద చర్చగా మారింది.

గ్రామ సభల ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశించినా, క్షేత్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతున్నాయని సమాచారం. స్థానిక నాయకులు తమ అనుచరులకు ప్రాధాన్యం కల్పించాలని కోరుతుండగా, అర్హత ప్రమాణాల విషయంలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో ఎంపిక జాబితాలపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో గ్రామ సభలు వాయిదా పడిన సందర్భాలు కూడా నమోదయ్యాయి.

ఇళ్ల కేటాయింపుల అంశం కాంగ్రెస్ పార్టీలోనే అంతర్గత విభేదాలకు కారణమవుతోంది. పాత నాయకులు, కొత్తగా పార్టీలో చేరిన నేతల మధ్య లబ్ధిదారుల ఎంపికపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ స్థాయిలో పార్టీ శ్రేణుల మధ్య అసంతృప్తి పెరుగుతుండటంతో స్థానిక నాయకత్వానికి ఇది సవాల్‌గా మారింది.

మరోవైపు ఈ పరిస్థితిని ప్రతిపక్షాలు రాజకీయ అవకాశంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లేదంటూ ఆరోపణలు చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నాయి. అర్హులందరికీ న్యాయం జరగడం లేదనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి.

పెరుగుతున్న అసంతృప్తిని తగ్గించేందుకు ప్రభుత్వం రెండో విడతలో మరిన్ని ఇళ్ల మంజూరుపై దృష్టి సారించింది. దశలవారీగా అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయినప్పటికీ ప్రస్తుతం గ్రామాల్లో ఇళ్ల కోటా చుట్టూ నెలకొన్న చర్చ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, లబ్ధిదారుల ఎంపిక వ్యవహారం గ్రామీణ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఈ అసంతృప్తిని ఎలా చక్కదిద్దుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ధాన్యం సేకరించడంలో వినాయక రైస్ మిల్ ముందజ

- **వినాయక రైస్ మిల్ పై.. రైతులు ప్రశంసలు**

**అక్బరుపేట భూంపల్లి మే 04 (ఆశ్వి అప్డేట్స్)**

వేగంగా ఐకేపీ వడ్లను అన్లోడింగ్ చేస్తూ.. రైతులకు అండగా ఖాజీపూర్ వినాయక రైస్ మిల్ నిలుస్తుందని రైతు అన్నలు ప్రశంసలు కురిపిస్తున్నారు. సిద్దిపేట జిల్లా అక్బరుపేట భూంపల్లి మండలంలోని ఖాజీపూర్ గ్రామం లోని ఉన్న వినాయక రైస్ మిల్ ఇప్పుడు రైతుల అందరికి అండగా నిలుస్తుంది..వివిధ గ్రామాలు మండలాల నుండి వచ్చిన ధాన్యాన్ని సేకరించడంలో ముందజలో దూసుకుపోతుంది..ఈ మిల్ లో రైతు బిడ్డలే మిల్ నిర్వాహకులు కావడంతో రైతుల కష్టాలను గమనించి..త్వత్వరిగా ధాన్యం సేకరిస్తున్నారనీ రైతులు పేర్కొన్నారు...దీంతో రైతులు రైస్ మిల్ యాజమాన్యం పై ప్రశంసలు గుప్పిస్తున్నారు...

**రైతులకు,వాహనాల డ్రైవర్లకు ప్రత్యేక్య కృతజ్ఞతలు**

సీరియల్ వారిగా రెండు మూడు రోజులు అయినా రైతుల కోసం తమ కుటుంబాలకు దూరంగా ఉండి రైతుల ధాన్యాన్ని వాహనంలో మిల్ కి తరలిస్తున్నటువంటి వాహనాలు డ్రైవర్ల




ఓపిక కి వినాయక రైస్ మిల్ అభినందనలు తెలుపుతున్నారు.రైతులకు ఎల్లప్పుడూ అండగా వినాయక రైస్ మిల్ తోడుగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు..



## గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి: మంత్రి సీతక్కకు విజ్ఞప్తి

**ఆశ్వి అప్డేట్స్ కొండపాక:**

కొండపాక మండలంలోని గ్రామాల్లో మౌలిక వసతులు, సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసవి లింగారావు ఆధ్వర్యంలో మండలం సర్పంచుల బృందం గురువారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇస్తూ నిధుల కేటాయింపునకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బూర్గుల మానస సురేందర్ రావు, పావని శశిధర్ రెడ్డి, కొయ్యడ వెంకటేశం, కొలుపుల గంగధర్ , పాక్స్ డైరెక్టర్ బూర్గుల సురేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల స్వీకరణ

**గజ్వేల్ జున్ 4 (ఆశ్వి అప్డేట్స్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం భాగంగా గజ్వేల్ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1 నుండి 5 వార్డులలో నిర్వహించిన వార్డు సభలు గురువారం విజయవంతంగా ముగిశాయి. ఇట్టి సభలలో మున్సిపల్ కమీషనర్ P గణేష్ రెడ్డి మార్గదర్శకత్వంలో వార్డు కౌన్సిలర్లు మరియు మున్సిపల్ యంత్రాంగం ఈ సభల్లో పాల్గొని ప్రజల విన్నపాలను స్వీకరించారు.మేనేజర్ సిహెచ్ బాలకృష్ణ వార్డు ఇన్చార్జ్ లు, సూపర్వైజర్లు, మెప్మా ఆర్ పి లు మరియు ఇతర సిబ్బంది అందరూ ఉదయం నుండే క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి సభల నిర్వహణను పర్యవేక్షించారు*ప్రజా సమస్యల స్వీకరణ:*పారిశుద్ధ్యం, మౌలిక వసతులు మరియు ఇతర పౌర సేవలకు సంబంధించి ప్రజలు అందించిన ఫిర్యాదులను అధికారులు నమోదు చేసుకున్నారు.మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం చేపట్టిన ఈ 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ఈరోజు సభల్లో అందిన వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమీషనర్ పేర్కొన్నారు.

## పిడిఎస్యు రాష్ట్ర విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులను విజయవంతం చేయండి

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 4**

నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలంలోని బిజ్వార్ గ్రామంలో ఈ నెల 11 నుండి 14 వరకు పి.డి.ఎస్.యు రాష్ట్ర రాష్ట్ర విద్య వైజ్ఞానిక తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ తరగతులను విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు పాల్గొని విజయవంతం చేయాలని నిలుపునిచ్చారు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ , గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్ లో పి.డి.ఎస్.యు విలేకరుల సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో విద్యారంగంలో ప్రైవేటీకరణ ఎక్కువైపోతుందని నిరుపేద విద్యార్థులు విద్య దూరమై లేబర్ కూలీలుగా మారుతున్నారు అన్నారు, ప్రభుత్వాలు ప్రభుత్వ విద్య బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు, ప్రైవేటీకరణ వ్యతిరేకంగా దేశంలో రాష్ట్రంలో జరుగుతున్న విద్యా ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా పిడి ఎస్ యు విద్యార్థి సంఘం ఎల్లవేళలా పేదల పక్షాన పోరాడుతుందని అన్నారు, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని అన్నారు, ఈ కార్యక్రమంలో PDSU రాష్ట్ర సహాయ కార్యదర్శి, అజయ్ కుమార్, నారాయణపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్ మహేష్, జిల్లా సహాయ కార్యదర్శి రాజు, నాయకులు అఖిల ,అనూష, పాల్గొన్నారు.






## ప్రభుత్వ బడుల్లోని గుణాత్మకమైన విద్య

**ఆశ్వి అప్టేట్స్ కొండపాక:**

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మకమైన విద్య అందుతుందని సిద్ధిపేట విద్యాశాఖ అధికారి శాస్త్రి పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం కుకునూరు పల్లి లో జరిగిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్ బుక్స్ మధ్యాహ్న భోజనం అందజేస్తుందని తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలోనే ఉంటారని ప్రభుత్వం అందించే ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలను డిఈవో సందర్శించారు. ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ బచ్చలి సత్తయ్య, గ్రామ సర్పంచ్ కనకవ్వ ఐలయ్య,జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ రంగనాథ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు బాలకిషన్, మహేష్ , శ్రీనివాస్, చైతన్య శంకర్ తదితరులు పాల్గొన్నారు. డీఈవోగా బాధ్యతలు తీసుకున్న మొదటిసారిగా కుకునూరుపల్లి మండలానికి వచ్చిన విద్యాధికారి శాస్త్రి ని గ్రామ సర్పంచ్ శాలువతో సత్కరించారు.



## పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 4**

నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని 14 వ వార్డులో రేష్మాబేగం మహమ్మద్ జాఫర్ తాజ్ యొక్క నిర్మాణం పూర్తిచేసుకున్న ఇందిరమ్మ ఇంటిని గురువారం పేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి,వార్డు కౌన్సిలర్ యల్.అరుణ మనోహర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శంకర్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ శివారెడ్డి మరియు కౌన్సిలర్ అరుణ మనోహర్ గౌడ్, లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి.రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి,మరియు కుంభం.శివకుమార్ రెడ్డి గారి ప్రత్యేక చొరవతో 14వ వార్డుకు మొత్తం 20 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, అందులో ఇప్పటికే 16 ఇండ్ల నిర్మాణం పూర్తై లబ్ధిదారులకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. మిగిలిన ఇండ్లు కూడా వేగంగా నిర్మాణం జరుగుతున్నాయని చెప్పారు.ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి నారాయణపేట పట్టణ అభివృద్ధి,మౌలిక సదుపాయాల కల్పన, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు.అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మనోహర్ గౌడ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి.సలీం,కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహిముద్ ఖురేషి, సీనియర్ నాయకులు భీంచందర్ గౌడ్,మాజీ కౌన్సిలర్ రమేష్,పళ్ళ అనిల్,యూసుఫ్ తాజ్,వెంకటేష్ గౌడ్, ఎరుకలి వెంకటయ్య, జబ్బార్,స్థానిక కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి ఎక్కడ నిర్లక్ష్యం వహించరాదు

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం**

**ఆశ్వి అప్డేట్, నా రాయణపేట జూన్ 4**

నారాయణ పేట జిల్లా మక్తల్ మండలం కాట్రేవుపల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ 1 పనులను గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్యాకేజ్ 1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి పంప్ హౌస్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శశ్రీధర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.





## వైభవంగా 'సహస్ర బ్రాహ్మణ సువాసిన్యర్చన

**ఆశ్వి అప్టేట్స్ కొండపాక:**

కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయ దుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో సహస్ర బ్రాహ్మణ సువాసిన్యర్చన (రజతోత్సవం) అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి పాల్గొన్నారు.శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి, శ్రీశ్రీశ్రీ వెదురుపాక గాడ్, చెప్యాల హరినాథ శర్మల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం సాగింది. జిల్లా నలుమూలల నుండి దాదాపు 1200 మంది మహిళలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ మహోత్సవాన్ని కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామిగల్ చరవాణి (ఫోన్) ద్వారా వీక్షించి, నిర్వాహకులకు, భక్తులకు తమ దివ్యాశీస్సులు అందజేశారు.

## పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 4**

నారాయణపేట జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ ఆధ్వర్యంలో ద్వారకా స్కూల్లో రెండు రోజుల పాటు జరిగే పండిత్ దిన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ జిల్లా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ Mlc anji reddy, బీజేపీ రాష్ట్ర Sc morcha president క్రాంతి కిరణ్, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజి, రాష్ట్ర సీనియర్ నాయకుడు డా ప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రోరెడ్డి కిషోర్ రెడ్డి ,రాష్ట్ర నాయకులు మురళీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి రాష్ట్ర సీనియర్ నాయకులు కొండయ్య, పూనమ్ చంద్ లాహోటి, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు రఘురామయ్యా, ప్రతాప్ రెడ్డి, బస్వరాజు కార్యక్రమ ప్రముఖ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి , లక్ష్మి గౌడ్, మున్సిపల్ చెర్మెన్ కొండ శ్వేతా యాదవ్ వైస్ చెర్మెన్ మంజులా GR రెడ్డి, కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్, బీజేపీ జిల్లా మండల పట్టణ పదది కారులు నాయకుల, సర్పంచులు, ఉపసర్పంచ్లు కౌన్సిలర్లు ముఖ్య సీనియర్ నాయకులు పాల్గొన్నారు.




## గ్రామాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

- **ప్రజా పాలనలో ఘన వ్యర్థాల నిర్వహణపై గ్రామ సభలు**
- **ఎస్.ఐ.ఆర్ పై ప్రజలకు అవగాహన**

**తూప్రాన్, జూన్ 04, (ఆశ్వి అప్డేట్స్ )**



గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం ఘన వ్యర్థాల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తూప్రాన్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం. జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం తూప్రాన్ మండల పరిధిలోని దాతర్పల్లి, మల్కాపూర్, ఘణపూర్ గ్రామ పంచాయతీలలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు.

దాతర్పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు ఆర్డీవో జయచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇళ్లనుంచే తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వాలు చేపడుతున్న స్వచ్ఛతా కార్యక్రమాలకు ప్రజల సంపూర్ణ సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

**కేంద్ర ప్రభుత్వ నూతన విధానం 'ఎస్.ఐ.ఆర్' పై అవగాహన**

ఈ సందర్భంగా ఆర్డీవో పర్యావరణ అంశాలతో పాటు కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విధానం గురించి ప్రజలకు ప్రత్యేకంగా వివరించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే కాకుండా, ప్రజాస్వామ్య ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నూతన సంస్కరణను తీసుకువచ్చిందని ఆయన తెలిపారు.ఈ విధానం ద్వారా ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దడం, మరణించిన వారి పేర్లను తొలగించడం మరియు శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను క్రమబద్ధీకరించడం వంటి ప్రక్రియలు మరింత పారదర్శకంగా మారుతాయని వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ నూతన విధానాన్ని అవగాహన చేసుకుని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అధికారులకు సహకరించాలని ఆర్డీవో సూచించారు.

అలాగే ఘణపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభలో మండల అభివృద్ధి అధికారి సతీష్ పాల్గొని, ఘన వ్యర్థాల నిర్వహణలో గ్రామ ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని స్పష్టం చేశారు. కాగా

మల్కా పూర్ లో నిర్వహించిన గ్రామ సభకు పంచాయతీ రాజ్ సహాయ ఇంజనీర్ మధుసూదన్ హాజరై గ్రామ స్థాయిలో వ్యర్థాల నిర్వహణ పద్ధతులు, శాస్త్రీయ పరిశుభ్రత చర్యలను ప్రజలకు వివరించారు.

ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ గంగరాజు గ్రామ నోడల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు జయరామ్ , పంజాల ఆంజనేయులు గౌడ్, వెంకటేష్ తో పాటు దాతర్పల్లి ఉపసర్పంచ్ ప్రవీణ్, వార్డ్ మెంబర్లు పిట్ల వెంకటేష్, చింతల సంతోష, చింతల లక్ష్మి తో పాటు కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, కుమ్మరి స్వామి,అశోక్, చింతల శ్రీనివాస్,పుట్నాల గణేష్, శంకర్ మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## ప్రీప్రైమరీ టీచర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ఆశ్వి అప్డేట్స్ జూన్-04**

మేడ్చల్:ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు మేడ్చల్ ఎంఈఓ శంకరయ్య తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఇన్స్ట్రక్టర్కు నెలకు రూ.8,000, ఆయాకు రూ.6,000 గౌరవ వేతనం ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.



## తిందామంటే.. ఇదేం 'దుర్గ'తి..!

- **హోటల్లో మున్సిపల్ అధికారుల తనిఖీలు**
- **నాసిరకం ఆహార పదార్థాలు స్వాదీనం**
- **నిర్వహాకులకు నోటీసులు జారీ**

**తాండూరు,...**

రుచిగా తిందామని హోటల్కు వెళితే.. దుర్గంధమైన ఆహార పదార్థాలు దర్శనమిచ్చే సంఘటనలు ఎదురవుతున్నాయి.
తాజాగా తాండూరు పట్టణం చించొల్లి రోడ్డు మార్గంలోని దుర్గా బార్ అండ్ రెస్టారెంట్ హోటల్లో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బుధవారం ఈ హోటల్లో నాసిరకం ఆహార పదార్థాలు వడ్డిస్తున్నారని సామాజిక మాధ్యమాలలో ప్రచారం జరిగింది. ఈ మేరకు గురువారం తాండూరు మున్సిపల్ ఇంచార్జ్ శానిటరీ ఇనుస్పెక్టర్ రాములు, సిబ్బందితో కలిసి హోటల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో నిర్వహకులు ఒక రోజు క్రితం చికెన్తో పాటు ఇతర ఆహార పదార్థాలు నాసిరకంగా ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాదీనం చేసుకున్నారు. అనంతరం హోటల్ నిర్వహకులకు నోటీసులు జారీ చేశారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఈఈ ప్రవీణ్ గౌడ్, జవాన్లు సిహెచ్ అశోక్, బొట్టు శ్రీను, రమేష్ తదితరులు ఉన్నారు.




## ప్రజల ధన, ప్రాణ రక్షణలో పోలీసుశాఖ నిరంతరం పని చేస్తుంది

- **బాధితుల వద్దకు వచ్చి కేసులు నమోదు చేస్తున్నాము**
- **సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్.**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఈరోజు సూర్యాపేట మున్సిపాలిటీ పరిధి 1వ వార్డు కుడకుడ గ్రామం నందు నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నర్సింహా ఐపీఎస్ గారు హాజరై మాట్లాడారు. ప్రజలు, సమాజం అభివృద్ధికి ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయి, అనేక సంక్షేమ పథకాలతో అభివృద్ధికి పాటుపడుతుంది అన్నారు, గ్రామం సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకు త్వరితగతిన వాటికి పరిష్కారం చూపడం కోసం ఈ గ్రామ, వార్డు సభలు ముఖ్య ఉద్దేశ్యం, అధికారులు ప్రజల వద్దకు వచ్చి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు అని తెలిపినారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీస్ శాఖ అనుక్షణం కృషి చేస్తుందని శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళుతున్నామని ఆధునిక పోలీసులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పౌరులు సత్ప్రవర్తనతో చట్ట పరిధిలో నడుచుకోవాలని సూచించారు. స్థానిక సమస్యలపై, అసాంఘిక కార్యకలాపాలపై, ఆకతాయిల పై సమాచారం ఇవ్వడం లో ప్రతి పౌరుడు యూనిఫామ్ లేని ఒక పోలీస్ అన్నారు. తగాదాలు గొడవలు పెట్టుకుంటే కేసుల పాలవుతారని ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు.. సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. మహిళల భద్రత లో పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత పనిచేస్తుందని అన్నారు, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల గురవ్వకుండా సురక్షితంగా గమ్యం చేరాలని అన్నారు. మన సమాజంలో యువతను గంజాయి లాంటి మాదకద్రవ్యం పట్టిపీడిస్తుందని దీనిని క్షేత్రస్థాయిలో నిర్మూలించాల్సిన బాధ్యత అందరికీ ఉన్నదని, గంజాయి కి సంబంధించిన సమాచారాన్ని పోలీసువారికి ఇవ్వాలని సూచించారు. ఫోన్లకు సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు బ్లూ లింకులు అనుసరించి బహుమతులు ఉన్నాయంటే అత్యాశ పోయి వ్యక్తిగత వివరాలు అపరిచితులకు ఇచ్చి ఆర్థికంగా నష్టపోవద్దని సైబర్ మోసాలకు గురి కావద్దు అని తెలిపారు. దాడులు, దొంగతనాలు, మహిళా వేదింపులు, రోడ్డు ప్రమాదాలు లాంటి సమస్యలపై, పోలీసు స్టేషన్ కు రాలేని పరిస్థితుల్లో ప్రజలు డయల్ 100, 112 కు సమాచారం ఇచ్చిన వెంటనే ఫిర్యాదుదారుల వద్దకే వచ్చి ఇంటి నుండే కేసులు నమోదు చేసి కేసు పత్రాలను ఫిర్యాదుదారులకు బాధితులకు అందిస్తున్నామని అన్నారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్, మునిస్పల్ కమిషనర్, స్థానిక కౌన్సిలర్, హెల్త్ సెంటర్ వైద్యులు, గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామ అధికారులు, స్థానిక ఎస్ఐ, గ్రామ పౌరులు ఉన్నారు.



## గంజాయి పట్టివేత.. ఇద్దరు నిందితుల అరెస్ట్

**ములుగు జున్ 4 (ఆశ్వి అప్డేట్స్ )**

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు రూరల్ సీఐ డి రవిరాజు
తెలిపారు సీఐ డి రవిరాజు వారు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం నాడు మధ్యాహ్నం సమయంలో ములుగు ఎస్సై రఘుపతి వచ్చిన సమాచారం ఏమనగా ములుగు మండలం కొత్తూరు గ్రామ శివారులో సీడ్స్ కంపెనీకి వెళ్ళు దారి వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా గంజాయి అమ్ముతూ ఉన్నారని సమాచారం మేరకు వెంటనే ములుగు ఎస్ఐ రఘుపతి మరియు టాస్కోఫోర్స్ సిబ్బంది సంయుక్త ఆపరేషన్లో అక్కడికి వెళ్ళగా, అక్కడ ఇద్దరు వ్యక్తులు 1. చింతల కార్తీక్ రాజ్ తండ్రి యాదగిరి,(20 )గ్రామం కొత్తూరు ములుగు మండల్ సిద్దిపేట జిల్లా 2. షేక్ సల్మాన్ తండ్రి ఫరీద్ (21 ) గ్రామం కొత్తూరు మండల్ ములుగు సిద్దిపేట జిల్లా, బైక్ పైన అనుమానాస్పదంగా ఉండగా వెంటనే వారిని అదుపులోకి తీసుకొని అట్టి అపాచీ బండి ట్యాంక్ కవర్లో చూడగా అందులో గంజాయి కలదు వెంటనే అటు ఇద్దరు వ్యక్తులను ఇరువురు పంచుల సమక్షంలో ఒప్పుకోలు మరి స్వాధీన పంచనామా జరిపి వారి వద్ద నుండి అందదా 44 గ్రాముల గంజాయి రెండు మొబైల్స్ ఐఫోన్ మొబైల్ , రెడ్మీనోట్ 14ప్రో బైక్ AP28DP5389 నెంబర్ గల అపాచి బండి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి గురువారంషరిమాండ్కు తరలించినట్లు సీఐ డి రవిరాజు తెలిపారు పిల్లలు ఎవరు గంజాయికి అలవాటు పడవద్దని ఒకవేళ ఎవరైనా పిల్లలు గంజాయి బారిన పడితే వారి తల్లి తండ్రులు మాకు పిర్యాదు చేసినట్లు అయితే వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారు అలవాటు మనుకునే విదంగా చర్యలు తీసుకుంటాము. గంజాయికి సంబందించిన సమాచారం వున్నట్లు అయితే నా యొక్క మొబైలు నంబర్ (8712667336) గాని లేదా యస్. ఐ ములుగు మొబైలు నంబర్ (8712667338) కి ఫోన్ చేయగలరు. గ్రామాలలో ఎవరైనా గంజాయి అమ్మిన, కలిగి వున్న సిగరేట్ లలో కలిపి తాగిన వారిపై చట్ట ప్రకారం వారిపై కఠిన చర్యలు తీస్కొని జైలుకి పంపడం జరగుతుందని పత్రిక ప్రకటన ద్వారా హెచ్చరించడం జరిగింది.



## అంతర్రాష్ట్ర కరుడుగట్టిన దొంగ వికాస్ సింగ్ అరెస్ట్

**ఆశ్వి అప్డేట్స్ క్రైమ్ బ్యూరో:**

వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికంఠ నగర్ కాలనీలో గత నెల (01.05.2026న) రాత్రి సమయం లో ఒకరి ఇంట్లోకి చొరబడి ఒకటిన్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 2,10,000 నగదును అపహరించిన చోరీ కేసును పోలీసులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు కాగా, ఈ కేసును అత్యంత ప్రాధాన్యతతో తీసుకున్న వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య గారి ఆధ్వర్యంలో సిసిఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ ఇన్స్పెక్టర్ రఘుకుమార్ ల నేతృత్వంలోని ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారం, మరియు నేర స్థల కదలికలను సిసి కెమెరాల ఆదారాలను విశ్లేషిస్తూ లోతైన దర్యాప్తు చేపట్టిన పోలీసులు, చివరకు నేర స్థలంలో సేకరించిన సాంకేతిక సాక్ష్యాల ఆధారంగా ఈ చోరీకి పాల్పడిన ప్రధాన నిందితుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వికాస్ సింగ్ అలియాస్ తేజా సింగ్ గా గుర్తించారు.





**సినిమా స్టైల్లో దొంగతనాలు దొంగసొమ్ముతో సేవా కార్యక్రమాలు విలాసవంతమైన జీవితం:**
ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారంలోని పోచమ్మ బస్తీ,గాంధీనగర్ మరియు సూరారం(సాయిబాబా నగర్) పరిసర ప్రాంతాలలో నివాసం ఉంటున్న వికాస్ సింగ్, పైకి కూలీ పనులు చేస్తున్నట్లు నటిస్తూ రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడేవాడు. గతంలో ఇతను దొంగతనం చేసిన ఏరియాలు అయిన నర్సాపూర్, మేడ్చల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని నేరాల్లో ఇతనే దొంగతనం పాల్పడినట్లు సాంకేతిక ఆదారాలు లభించాయి. దీనితో నిందితుడిపై గట్టి నిఘా పెట్టిన జిల్లా పోలీస్ అధికారులు, అర్ధరాత్రి సమయంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు నమ్మలేని నిజాలు వెల్లడించాడు. 16 ఏళ్ల మైనర్ వయసులోనే నేర జీవితాన్ని ప్రారంభించిన ఇతనిపై గతంలో సంగారెడ్డి, బొల్లారం పరిసర ప్రాంతాలలో సుమారు 34 రాత్రి వేళల దొంగతనం కేసులు ఉన్నాయి. 2018లో నాలుగు, 2021లో తొమ్మిది, 2022లో 21 కేసుల్లో సంగారెడ్డి పోలీసులు ఇతడిని అరెస్ట్ చేయగా, జైలు శిక్ష అనుభవించి 2024 జూన్ 26నాడు జైలు నుండి విడుదలయ్యాడు. అయినప్పటికీ ఇతని ప్రవర్తనలో మార్పు రాకపోగా, తిరిగి వికారాబాద్ జిల్లా, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పరిధుల్లో మొత్తం 27 రాత్రి పూట దొంగతనాలకు పాల్పడి 157 తులాల బంగారం, 256 తులాల వెండి, రూ. 8,22,500 నగదును దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. దొంగతనం ద్వారా వచ్చిన డబ్బుతో నిందితుడు జల్సాలు చేయడమే కాకుండా, తన స్వగ్రామంలో ప్రజలకు 'హెల్పింగ్ హ్యాండ్'అనే ఎన్జిఓ పేరుతో డబ్బులు స్కూల్స్ లో బ్యాగులు ,నోట్ బుక్ లు పంచుతూ, స్నేహితులను విహారయాత్రలకు చెన్నై, గోవా, విజయవాడ, విశాకపట్నం, బెంగళూర్, రాజస్తాన్ మరియు డెహ్రాడూన్ లకు తీసుకెళ్తూ స్థానికంగా తనపై ఎవరికీ అనుమానం రాకుండా ఒక రకమైన సామాజిక రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసుకున్నాడు.

**దొంగను ప్రోత్సహించిన బంగారం వ్యాపారుల ముఠా:**
దొంగిలించిన ఆభరణాలను తన స్వగ్రామ పరిసర ప్రాంతాలు అయిన కుర్వర్ మరియు గంజేరి క్రింద ఉన్న బంగారం షాప్ యజమానులకు అమ్మ ద్వారా అమ్మేవాడని విచారణలో తేలింది:
1) శ్యామ్ మోహన్ (బాబా శాలిక్ రామ్, బంగారం షాప్ యజమాని) - నివాసం: కుర్వర్, సుల్తాన్‌పూర్ జిల్లా, ఉత్తరప్రదేశ్ (UP).
2) సూరజ్ మోహన్ (బాబా శాలిక్ రామ్,బంగారం షాప్ యజమాని) - నివాసం: కుర్వర్, సుల్తాన్‌పూర్ జిల్లా, ఉత్తరప్రదేశ్ (UP).
3) అశోక్ సోని (అశోక్ సోని జెవెలర్స్ యజమాని) - నివాసం: కుర్వర్, సుల్తాన్‌పూర్ జిల్లా, ఉత్తరప్రదేశ్ (UP).
4) వికాస్ అగ్రహారి (వికాస్ జెవెలర్స్ స్టోర్- గంజేరి)- నివాసం: భగ్వాన్ పూర్, సుల్తాన్‌పూర్ జిల్లా, ఉత్తరప్రదేశ్ (UP).
మైనర్గా ఉన్నప్పుడు దొంగతనాలు చేసిన మాట వాస్తవమేనని, అయితే తర్వాత ఈ బంగారం షాప్ యజమానులు దొంగసొమ్ము ద్వారా ఎక్కువ లాభాలు గడించడం అలవాటు పడి, ఇతర రాష్ట్రాలలో దొంగతనాలు చేసి తమకు బంగారం అమ్మితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, తనను ప్రోత్సహించారని నిందితుడు ఒప్పుకున్నాడు. తన దగ్గర డబ్బులు లేకపోయినా ముందే డబ్బులు ఇచ్చి మరి నేరాలకు పురికొల్పేవారని, ఒకానొక దశలో తను దొంగతనాలు చేయడానికి భయపడితే, పైన పేర్కొన్న యజమానులందరూ తలా రూ. 10,000 చొప్పున మొత్తం 40,000 రూపాయాలు ఇచ్చి అక్రమంగా తుపాకి కొనడానికి కూడా ప్రోత్సహించారని, వారి ప్రోత్సాహం తోనే ఒక తుపాకి కొనడం జరిగింది అని నిందితుడు సంచలన నిజాలు వెల్లడించాడు. నిందితునిపై పా

## బోధిధర్మ ఆయుర్వేదం పేరుతో ప్రాణాల వ్యాపారమా..?

- **క్యాన్సర్ తగ్గిస్తామని చెప్పి కిడ్నీలు దెబ్బతీశారా..?**
- **ఆయుర్వేదం ముసుగులో లక్షల దోపిడీ ఆరోపణలు**
- **చర్యలు తీసుకోవాలంటూ బాధితుల డిమాండ్**

**హనుమకొండ:**

ఆయుర్వేదం మందులు ఇచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న బోధిధర్మ ఆయుర్వేదిక్ ట్రస్ట్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. బోడుప్పల్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ, ఆయుర్వేదం మరియు సిద్ధ వైద్యం పేరుతో ప్రజల నుంచి భారీ మొత్తంలో వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతోందని బాధితులు ఆరోపిస్తున్నారు.
బాధితుల కథనం ప్రకారం, ట్రస్ట్ నిర్వాహకుడు పండిట్ శ్రీనివాస్కు ఆయుర్వేద వైద్యంలో కనీస అర్హతలు లేవని, అయినప్పటికీ తాను ఎన్నో క్లిష్ట వ్యాధులను నయం చేయగలనంటూ యూట్యూబ్, సోషల్ మీడియాలలో తప్పుడు ప్రచారం చేసుకుంటూ ప్రజలను ఆకర్షిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా క్యాన్సర్, కిడ్నీ, కాలేయం వంటి ప్రాణాంతక వ్యాధులకు పూర్తి స్థాయి చికిత్స అందిస్తామని తప్పుడు హామీలు ఇస్తూ రోగుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు.
తాజాగా హనుమకొండకు చెందిన ఓ మహిళకు క్యాన్సర్ నయం చేస్తామని చెప్పి సిద్ధ వైద్యం మందులు ఇచ్చారని, వాటి వాడకం తర్వాత ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించి కిడ్నీలు తీవ్రంగా దెబ్బతిన్నాయని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ ఘటనతో బాధిత కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది.
ఇదే వ్యక్తిపై గతంలో కూడా అనేక ఆరోపణలు వచ్చాయని, కొన్ని మీడియాలలో కథనాలు ప్రచురించినప్పటికీ ఆయుష్ డిపార్ట్మెంట్ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరపలేదని, ఆయుష్ డిపార్ట్మెంట్ అధికారులు మామూళ్ల కోసం ఇతనితో చేతులు కలిపారని బాధితులు విమర్శిస్తున్నారు. కొంతమంది అధికారులను ఆర్థిక బలంతో ప్రభావితం చేస్తూ వ్యవహారాన్ని మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు.
ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశంలో ప్రభుత్వం, ఆయుష్ శాఖ, ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. అర్హతలు లేకుండా వైద్య సేవలు అందిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నకిలీ వైద్య కేంద్రాలపై ప్రత్యేక దాడులు నిర్వహించాలని కోరుతున్నారు.
ఆరోగ్యం పేరుతో ఆశ చూపించి ప్రాణాలతో వ్యాపారం చేసే వారిని ఉపేక్షిస్తే మరిన్ని అమాయక కుటుంబాలు బలవుతాయని ప్రజలు హెచ్చరిస్తున్నారు. బోధిధర్మ ఆయుర్వేదిక్ ట్రస్ట్ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలికితీసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్ని వర్గాల నుంచి డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.



## ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అడిషనల్ డిసిపి నరసింహారెడ్డి...

**నిజాంపేట జూన్ 4 ఆశ్వి అప్డేట్...**

మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో గురువారం సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ భైరవరెడ్డి, జన్మదినాన్ని పురస్కరించుకొని జర్నలిస్ట్ భైరవరెడ్డి గ్రామ సర్పంచ్ పాలకవర్గ ఆధ్వర్యంలో ఆర్విఎం హాస్పటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అవసరం ఉన్న రోగులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు ఉచిత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి, రామాయంపేటసిఐ సైదా, ఎస్ఐ రాజేష్,లు హాజరయ్యారు.ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితాలలో ప్రతి మనిషి ఆరోగ్యవంతులుగా ఉండాలంటే ప్రతిరోజు వ్యాయామం,రన్నింగ్ ముఖ్యమన్నారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఆరోగ్య సమస్యలపై వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామాలలో ఇలాంటి ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని ఈ ఉచిత వైద్య శిబిరానికి కృషి చేసిన సీనియర్ జర్నలిస్ట్ భైరవరెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గానికి అభినందించారు. గ్రామంలో యువకులు ఆన్లైన్ గేమ్ లకు పాల్పడుతున్నారని ప్రతి ఒక్క తండ్రి తమ పిల్లలపై దృష్టి సారించాలని వారి మంచి భవిష్యత్తుకు బాటగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొమ్మన మల్లేశం,



ఉపసర్పంచ్ ఆకుల మహేందర్, ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రాంరెడ్డి, ఆర్ వి ఎం వైద్య బృందం డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ లయ సంహిత, డాక్టర్ ఎం నికిత, డాక్టర్ సీతారాం సుఖేష్, డాక్టర్ శరన్ దయాల్, డాక్టర్ జయంత్ నాయక్, మార్కెటింగ్ మేనేజర్ మంచినీళ్ల లక్ష్మణ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ సంతోష్, పవన్,డైరెక్టర్ బాజా రమేష్, అబ్బా రెడ్డి, సంగిపు నారాయణ, కార్యదర్శి శ్యామల, పంచాయతీ కారోబార్ సంఘే పు రమేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అరుణాచలం గిరిప్రదక్షిణ దారిలో ఘోరం

- **23 ఏండ్ల యువతిపై గ్యాంగ్‌రేప్.. నగ్న వీడియోలు తీసి బెదిరింపులు.. 8 మంది అరెస్ట్**

తిరువణ్ణామలై, తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో సంచరించే అరుణాచలం గిరిప్రదక్షిణ మార్గంలో ఇద్దరు యువతులపై దుండగులు దాడి చేయగా, వారిలో ఒక 23 ఏండ్ల యువతిపై సామూహిక అత్యాచారం జరిగిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. పవిత్ర క్షేత్రంగా భావించే ప్రాంతంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం భక్తుల్లో భయాందోళనలకు గురి చేసింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మే 30న రాత్రి గిరిప్రదక్షిణకు వచ్చిన ఇద్దరు యువతులు అడిఅణ్ణామలై ప్రాంతం సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా కొందరు దుండగులు వారిని అడ్డగించారు. అనంతరం బలవంతంగా సమీప అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి ఒక యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. మరో యువతిపై కూడా దౌర్జన్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

దుండగులు బాధితుల నగ్న వీడియోలు చిత్రీకరించి, వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. అనంతరం వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, విలువైన వస్తువులు దోచుకుని అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది.

తీవ్ర మానసిక ఆందోళనకు గురైన బాధితులు మే 31న తిరువణ్ణామలైలోని మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసును అత్యంత సీరియస్‌గా తీసుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారంతో పాటు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి గాలింపు చేపట్టారు.

ఈ కేసును ఛేదించేందుకు ఐదు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసిన అధికారులు, వివిధ ప్రాంతాల్లో గాలింపు ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా మొత్తం 11 మంది నిందితులను గుర్తించినట్లు సమాచారం. వారిలో వాసుదేవన్, ఆకాష్, అప్పు, హరిహరన్, అరుణ్ కుమార్, శివగణేషన్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిసింది. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.

అయితే, ఈ ఘటనలో మరో కోణం కూడా వెలుగులోకి వచ్చింది. బాధితులలో ఒకరు రాత్రి సమయంలో తన స్నేహితుడితో కలిసి గిరిప్రదక్షిణ మార్గంలో తిరుగుతుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ఈ ఘటన అనంతరం బాధితురాలి స్నేహితుడిని విచారించిన పోలీసులు, అతడి వాంగ్మూలాన్ని కూడా నమోదు చేసినట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉంటే, అరుణాచలం గిరిప్రదక్షిణ మార్గంలో భద్రతా లోపాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి వేళల్లో భక్తుల రక్షణ కోసం అదనపు పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, గస్తీ బలగాల పెంపు అవసరమని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పవిత్ర క్షేత్రంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై తమిళనాడు వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతుండగా, కేసులో మిగిలిన నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.



# సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడమే లక్ష్యం

**గద్వాల/పాలమూరు ఉమ్మడి మహబూబ్‌నగర్, ఆశ్వ అప్డేట్**

గద్వాల/పాలమూరు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు జిల్లాలో సుడిగాలి పర్యటన కొనసాగిస్తున్నారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి గారు జోగులాంబ గద్వాల జిల్లా ధారూర్ మండలం గూడెందొడ్డి వద్ద జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న స్టేజీ 1 పంప్ హౌస్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంప్ హౌస్ పనుల పురోగతిని, నీటి పంపింగ్ సామర్థ్యాన్ని నీటి పారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్న సీఎం.. పనులను త్వరితగతిన పూర్తి చేయడంపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

అంతకుముందు, ఉదయం నుండి ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి గారు తొలిగా మక్తల్ - నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు.

అనంతరం హెలికాప్టర్ ద్వారా కోయిల్ సాగర్ ప్రాజెక్టు, భీమా మరియు కృష్ణా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల నిర్మాణం, అలాగే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డ్యామ్ సైట్ పరివాహక ప్రాంతాలను నిశితంగా ఏరియల్ సర్వే (వైమానిక వీక్షణం) చేశారు.

జూరాల ఏరియల్ సర్వే ముగించుకుని నేరుగా గూడెందొడ్డి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి శ్రీ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు మరియు జిల్లా మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి గారితో కలిసి నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు ప్రాధాన్యత, ప్రగతిపై నీటి పారుదల శాఖ అధికారులు ప్రత్యేకంగా రూపొందించిన లఘు చిత్రాన్ని (షార్ట్ ఫిలిం) వీక్షించారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, సాగునీటి శాఖ ఉన్నతాధికారులు మరియు జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# నీకెందుకురా..? ప్రతి దాంట్లో వేలుపెట్టడం..!

**ఆశ్వ అప్డేట్**

సినీనటుడు ప్రకాష్ రాజ్ పై ప్రొడ్యూసర్ బండ్ల గణేష్ ఓ రేంజ్ లో ఫైర్ అయ్యారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై ప్రకాష్ రాజ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఆయనపై బండ్ల గణేష్ ఫైర్ అయ్యారు. తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేయాలనే పవన్ ఆలోచనపై.. ప్రకాష్ రాజ్ వ్యంగ్యంగా మాట్లాడుతూ పోస్ట్ చేయడంతో బండ్ల గణేష్ కు చిర్రెత్తుకొచ్చింది. "నీకెందుకురా ప్రతి దాంట్లో వేలుపెట్టడం? అసలు నువ్వెవడివి? తమిళోడివా, తెలుగోడివా, కన్నడోడివా? నీ ఊరు ఏది, నీ కథ ఏంటి? ప్రతి ఊర్లో, ప్రతి ఇష్యూలో దూరి జడ్జిమెంట్‌లు ఇవ్వడానికి నువ్వేమైనా కలెక్టర్‌వా లేక దేశ



ప్రధానివా? ఎక్కడ చూసినా నువ్వే, ఏ విషయం వచ్చినా నువ్వే. నీ బతుక్కి పని లేకపోతే చూసుకో, కానీ అందరి విషయాల్లో దూరి హీరోలా ఫీలవ్వకు. ముందు నీ అడ్రస్ నువ్వు తెలుసుకో, తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయ్!" అంటూ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు....

# జగ్గారెడ్డితో పవన్ కళ్యాణ్ భేటీ?...

**ఆశ్వ అప్డేట్**

ఇద్దరి మధ్య ఉన్న స్నేహబంధం, ఇటీవల పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు తెరలేపుతున్నాయి.

ప్రెస్‌మీట్‌లో జగ్గారెడ్డి పేరును ప్రస్తావించిన పవన్, ఆయనతో సమావేశం కావాలనుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.

ఒకవేళ ఈ భేటీ నిజమైతే అది రాజకీయంగా ఎలాంటి సంకేతాలు పంపుతుందన్నదే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.






# డీలిమిటేషన్‌కు కేంద్రం అడుగులు

- **2029 ఎన్నికల ముందే పునర్విభజన లక్ష్యం**
- **రాజకీయ పార్టీలతో సంప్రదింపులు**
- **దక్షిణాది ఆందోళనలకు పరిష్కార ప్రయత్నాలు**
- **పార్లమెంట్‌లో కొత్త బిల్లు తెచ్చేందుకు కసరత్తు**



**న్యూఢిల్లీ, జూన్ 4:** దేశంలోని పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు సమాచారం. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో రాజకీయ పార్టీలతో సంప్రదింపులు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అవసరమైన చట్టపరమైన మార్పులపై కూడా కేంద్రం దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం దేశంలో లోక్‌సభ స్థానాల కేటాయింపు 1971 జనాభా లెక్కల ఆధారంగా కొనసాగుతోంది. గత కొన్ని దశాబ్దాలుగా జనాభాలో భారీ మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో తాజా పరిస్థితులకు అనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్త డీలిమిటేషన్ ప్రక్రియకు మార్గం సుగమం చేసే బిల్లును కేంద్రం తీసుకురావచ్చని ప్రచారం జరుగుతోంది. పునర్విభజన అమలులోకి వస్తే పలు రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్యలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. జనాభా పెరుగుదల అధికంగా ఉన్న రాష్ట్రాలకు అదనపు ప్రాతినిధ్యం లభించే అవకాశముండగా, కొన్ని రాష్ట్రాల్లో ప్రస్తుత రాజకీయ సమీకరణాలు మారే పరిస్థితి ఏర్పడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అంశంపై విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం సాధించేందుకు కేంద్రం ప్రాంతీయ పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. పలు రాష్ట్రాలకు చెందిన ప్రధాన రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకుని వివాదాలకు తావులేకుండా ముందుకు సాగాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే డీలిమిటేషన్ ప్రతిపాదనపై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించిన రాష్ట్రాలకు నష్టం కలగకూడదనే అభిప్రాయం అక్కడి రాజకీయ పార్టీల్లో వ్యక్తమవుతోంది. ఈ ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగేలా సమతుల్య విధానాన్ని రూపొందించేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. రాజకీయ పార్టీలతో సంప్రదింపులు పూర్తైన తర్వాత డీలిమిటేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశముందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయితే దేశ రాజకీయ పటంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ విమర్శలు

**ఆర్థిక సంక్షోభ హెచ్చరికపై దుమారం**

**ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపణ**

**దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందన్న బీజేపీ**



**న్యూఢిల్లీ, జూన్ 4 :** దేశంలో త్వరలోనే ఆర్థిక సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని, పరిస్థితులు మరింత దిగజారితే అత్యవసర పరిస్థితుల తరహా పరిణామాలు చోటుచేసుకోవచ్చని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తూ, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నమని ఆరోపించింది. కాంగ్రెస్ గిరిజన విభాగం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన రాహుల్ గాంధీ దేశంలో ధరలు పెరుగుతున్నాయని, సామాన్య ప్రజలపై ఆర్థిక భారం అధికమవుతోందని అన్నారు. గతంలో దేశాన్ని ఆర్థిక ఒత్తిళ్ల నుంచి కాపాడిన పలు వ్యవస్థలు బలహీనపడ్డాయని ఆరోపించారు. ప్రజల అసంతృప్తిని అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని కూడా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ వ్యాఖ్యలను నిరాధార ఆరోపణలుగా కొట్టిపారేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటోందని, భారత ఆర్థిక పరిస్థితి పటిష్టంగా ఉందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి సూచీలు, పెరుగుతున్న పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, విదేశీ మారక నిల్వలు ఆర్థిక బలానికి నిదర్శనమని వివరించారు. బీజేపీ ఐటీ విభాగం జాతీయ ఇన్‌ఛార్జి అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందిస్తూ, రాహుల్ వ్యాఖ్యలు ప్రజల్లో భయాన్ని పెంచే ప్రయత్నమని విమర్శించారు. గత పదేళ్లలో దేశ ఆర్థిక రక్షణ వ్యవస్థలు మరింత బలపడ్డాయని, ద్రవ్యోల్బణం నియంత్రణ, పెరుగుతున్న విద్యుత్ వినియోగం, వాహన విక్రయాలు, విదేశీ మారక నిల్వలు వంటి అంశాలు దేశ ఆర్థిక స్థిరత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రమంత్రి లలన్ సింగ్ కూడా రాహుల్ వ్యాఖ్యలపై స్పందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రజాస్వామ్య విలువలకు ప్రధాని నరేంద్ర మోదీ కట్టుబడి ఉన్నారని అన్నారు. గతంలో దేశంలో అమలైన అత్యవసర పరిస్థితులను గుర్తు చేస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు, వాటిపై బీజేపీ నేతల ప్రతిస్పందనతో దేశ రాజకీయాల్లో మరోసారి ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్య పరిరక్షణ అంశాలు చర్చకు వచ్చాయి. ఇరు పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతుండగా ఈ అంశం జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# జూన్ 6 నిరసనపై దుమారం

**'అడ్డుకుంటే అల్లర్లు' వ్యాఖ్యలతో వైరల్ వీడియో.. సీజేపీ చుట్టూ వివాదం**

**న్యూఢిల్లీ:** ఈ నెల 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ముందు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. పార్టీ మద్దతుదారుడిగా చెప్పబడుతున్న ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. వైరల్ అవుతున్న వీడియోలో అమిత్ కుమార్ సింధ్ అనే వ్యక్తి మాట్లాడుతూ, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుంటే అక్కడే అల్లర్లు చెలరేగే అవకాశం ఉందని వ్యాఖ్యానించినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే నిరసనలో పాల్గొనేవారు తమ రక్షణ కోసం పెప్పర్ స్ప్రేలు, కర్రలు వెంట తెచ్చుకోవాలని సూచించినట్లు వీడియోలో కనిపిస్తోంది. పోలీసులు నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునే అవకాశం ఉందని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చినట్లు తెలుస్తోంది. వీడియోలోని మరో భాగంలో "ఇప్పటివరకు చాలా భరించాం.. ఈసారి హద్దులు దాటుతాం" అంటూ చేసిన వ్యాఖ్యలు మరింత వివాదానికి కారణమయ్యాయి. దీంతో సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నెల 6న భారత్‌కు రానున్నట్లు సమాచారం. అనంతరం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమానికి అనుమతి కోరనున్నట్లు తెలిసింది. వైరల్ వీడియోపై వివాదం నెలకొన్న నేపథ్యంలో స్పందించిన అభిజీత్ దీప్కే, తమ ఉద్యమం పూర్తిగా శాంతియుత పద్ధతుల్లోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగంపై తనకు పూర్తి విశ్వాసముందని, ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే హక్కు ఉందని పేర్కొన్నారు. అయితే వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో జూన్ 6న జరగనున్న నిరసన కార్యక్రమంపై పోలీసు వర్గాలు అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిరసన శాంతియుతంగా, చట్టబద్ధమైన పరిమితుల్లోనే కొనసాగుతుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఎయిర్‌పోర్టులో భారీ విదేశీ కరెన్సీ స్వాధీనం

- **ముంబై సీఐఎస్ఎఫ్ అప్రమత్తతతో వెలుగులోకి ఘటన**
- **కోటి ముప్పై తొమ్మిది లక్షల విలువైన డాలర్లు గుర్తింపు**







**ముంబై, జూన్ 4:** ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సిబ్బంది అప్రమత్తతతో భారీ మొత్తంలో విదేశీ కరెన్సీ పట్టుబడింది. సాధారణ భద్రతా తనిఖీల సమయంలో ఎక్స్-రే సామగ్రి పరిశీలన వ్యవస్థలో అనుమానాస్పద వస్తువు గుర్తించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. సీఐఎస్ఎఫ్ సిబ్బంది ప్రయాణికుడి చేతి సామానును క్షుణ్ణంగా తనిఖీ చేయగా, ప్రకటించని విదేశీ కరెన్సీ బయటపడింది. మొత్తం లక్షా నలభై ఐదు వేల అమెరికన్ డాలర్లు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. భారత కరెన్సీలో దీని విలువ సుమారు కోటి ముప్పై తొమ్మిది లక్షల రూపాయలుగా అంచనా వేస్తున్నారు. ఈ విదేశీ కరెన్సీని తీసుకెళ్తున్న వ్యక్తి విదేశీ పౌరుడిగా గుర్తించారు. అతను ముంబై నుంచి అడిస్ అబాబా నగరానికి ప్రయాణిస్తున్న సమయంలో ఈ తనిఖీలు నిర్వహించారు. అవసరమైన అనుమతులు లేకుండా భారీ మొత్తంలో విదేశీ కరెన్సీ తరలించే ప్రయత్నం చేసినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే ఆ వ్యక్తిని, స్వాధీనం చేసుకున్న కరెన్సీతో పాటు కస్టమ్స్ అధికారులకు అప్పగించినట్లు సీఐఎస్ఎఫ్ తెలిపింది. ఈ ఘటనపై కస్టమ్స్ శాఖ అధికారులు తదుపరి విచారణ చేపట్టారు. విమానాశ్రయ భద్రతలో భాగంగా నిర్వహించే తనిఖీల్లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది చూపిన అప్రమత్తత వల్ల ఈ అక్రమ రవాణా యత్నం విఫలమైందని అధికారులు పేర్కొన్నారు. దేశ భద్రత, ఆర్థిక నేరాల నిరోధంలో భద్రతా బలగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయాల్లో భద్రతా తనిఖీలు మరింత కట్టుదిట్టంగా కొనసాగుతున్నాయని, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ఎలాంటి రాజీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

# రాజ్యసభ ఎన్నికల అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

**ఢిల్లీ:** రాజ్యసభ ఎన్నికలు, ఒడిశా ఉప ఎన్నికకు సంబంధించి బీజేపీ తన అభ్యర్థుల జాబితాను గ్నురువారం ప్రకటించింది. మొత్తం 11 మంది అభ్యర్థులతో జాబితాను ప్రకటించింది. రాజస్థాన్ నుంచి రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా సతీశ్ పూనియా, అల్కా గుర్జర్, మధ్యప్రదేశ్ నుంచి తరుణ్ చుగ్, రజనీశ్ అగ్రవాల్, అరుణాచల్ ప్రదేశ్ నుంచి తాయ్ తాగాక్, మణిపూర్ నుంచి శారదా దేవిని బరిలోకి దింపింది. గుజరాత్ నుంచి రాజూభాయ్ శుక్లా, ముకేశ్‌భాయ్ రాఠ్వా, మాన్‌సింగ్ పర్మార్, జితేంద్రసింగ్, మేఘ్‌జీభాయ్ కంజారియా బరిలో నిలిచారు. ఇక ఒడిశా రాజ్యసభ ఉపఎన్నికలో దేబాశిష్ సామంతరాయ్‌ను రంగంలోకి దించింది. జూన్ 18న ఎగువ సభకు ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ రాష్ట్రాల్లో బీజేపీకి మెజారిటీ ఉన్న నేపథ్యంలో అభ్యర్థుల విజయం నల్లేరు మీద నడకే అని విశ్లేషకులు అంటున్నారు. 245 సభ్యులున్న రాజ్యసభలో ఎన్డీయే కూటమి సంఖ్యా బలం 148కాగా, బీజేపీ ఎంపీలు 113 మంది ఉన్నారు. ఇక రాజ్యసభ ఎంపీలు హర్దీప్ సింగ్ పురీ, దినేశ్ శర్మ, అరుణ్ సింగ్, ప్రొఫెసర్ రామ్ గోపాల్ యాదవ్‌ల పదవీ కాలంలో కూడా నవంబర్‌లో పూర్తికానుంది.



# బ్రేకప్ బాధ నుంచి బయటపడాలంటే



అలానే మీ జీవితానికి వాళ్లకు ఎటువంటి సంబంధం లేదు. గతం లో జరిగింది తిరిగి మళ్లీ రాదు. సమయం ఆలా వుండకూడదు అని, అలా జరగకుండా ఉంటే ఈపాటికి ఆనందంగా ఉండగలం అన్న ఆలోచనలు వద్దు. పైగా సమయం తిరిగి రాదు. తిరిగి మీరు మళ్ళీ కలుసుకుంటారు అన్న అపోహని తీసుకు రాకండి. పదేపదే జరిగిన వాటిని తలుచుకుని బాధ పడి పోకండి. మీ భవిష్యత్తు మీద మీకు నమ్మకం ఉండాలి. మీరు ఫోకస్ చేయాలి. ప్లాన్స్ తో మీరు మీ గమ్యాన్ని చేరుకోవాలి. వాటి కోసం మీరు కనుక ఆలోచించారు అంటే తప్పకుండా మంచి దారి లో మీరు వెళ్ళడానికి వీలవుతుంది. అలానే మీరు ఆనందకరమైన జీవితాన్ని గడపవచ్చు. పైగా దీని వల్ల మీరు మంచి జీవితాన్ని కూడా పొందొచ్చు. అంతే కానీ పదే పదే తలుచుకుని బాధ పడడం ఏ మాత్రం మంచిది కాదు.

# ఇలా చేయండి..



**అలానే ఒక సారి మీకు బ్రేకప్ అయిన తర్వాత మీరు వీలైనంత వరకు స్టేబుల్ గా ఉండాలి. వాళ్లని మీకు దూరంగా ఉంచండి. మీ ఆలోచనలని మీరు కంట్రోల్ చేసుకోండి దానితో పాటుగా మీరు మీ సోషల్ మీడియా లో వాళ్ళని బ్లాక్ చేయండి. వాళ్ల విషయాలు మీకు ఏ విధంగా కూడా తెలియకుండా జాగ్రత్త పడండి. సోషల్ మీడియా లో వాళ్లని ఫాలో అవ్వడం మానేయండి. ఒకవేళ మీరు ఫాలో అవుతూ ఉంటే వాళ్ళ యొక్క ఫోటోలు పోస్ట్స్ మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తూ ఉంటాయి. కాబట్టి మీరు దానికి కూడా దూరంగా ఉండటం మంచిది.**

''ప్రేమ ఎంత మధురం.. ప్రియురాలు అంత కఠినం'' అని ఆ రోజుల్లోనే ఆత్రేయ తన కలంతో ప్రేమ వల్ల కలిగే కన్నీటి గాథను వివరించారు. కానీ ఈ కుర్రకారు వినరుకదా. యవసు రావడంతోనే ప్రేమ.. ప్రేమ అంటారు. కానీ ఆ ప్రేమలో ఉన్నంత కాలం ఎంత మధురంగా ఉంటుందో.. ఒక్కసారి దూరమైతే జీవితమంతా ఆ వ్యథ తీరదు. అణుక్షణం ప్రేమించిన వ్యక్తిని తలుచుకుని బాధపడుతుంటారు. అందుకేనేమో ప్రేమలో విఫలమైన అబ్బాయిలు దీనిపైనే ఆసక్తి చూపరు. తమపై అయితే.. అసలు పట్టింపే ఉండదు. అయితే ఇలాంటి బ్రేకప్ బాధ నుంచి బయటపడాలంటే కొన్ని మార్గాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. ఏదో ఒక కారణం వల్ల బ్రేకప్ అయిపోతూ ఉంటుంది. చాలా మందికి ఆ ప్రేమ నుంచి బయట పడడం కాస్త కష్టమే అని అందరూ అనుకుంటారు. అవును ఇది నిజం. దాని నుంచి బయట పడటం చాలా కష్టమే కానీ ప్రయత్నిస్తే సాధించలేనిది ఏమీ ఉండదని నిపుణలు అంటున్నారు. పైగా సమయం మళ్ళీ తిరిగి రాదు. చాలా మంది ఈ బాధలో బతుకుతూ సమయాన్ని వృధా చేసుకుంటారు. నిండు బంగారు భవిష్యత్తుని వదిలేసుకుంటూ వృధా చేస్తారు. ఎంత త్వరగా ఈ ఆలోచనల నుంచి బయట పడితే అంత మంచిది. పైగా మీ జీవిత గమ్యాన్ని మీరు తిరిగి చేరుకోవడానికి వీలవుతుంది. అంతే కానీ ఏడుస్తూ, చింతిస్తూ, బాధ పడటం వల్ల ఆరోగ్యం మాత్రమే చెడిపోతుంది. కాబట్టి ఎంత త్వరగా మూవ్ ఆన్ అయితే అంత మంచిది అని మీరు తెలుసుకోవాలి.మీ హృదయానికి మీ మైండ్ ఏమనుకుంటుందో తెలియాలి. మీరు పదే పదే మీ ఎక్స్ కోసం ఆలోచిస్తున్నారా..? అంటే దానికి అర్థం మీరు ఇంకా దాని నుంచి బయట పడలేదు అని అర్థం. దీనికి అర్థం మీరు వాళ్ళతో ఇంకా ప్రేమ లో ఉన్నారని మాత్రం కాదు. అంటే ఈ బాధ నయమవడానికి కాస్త సమయం పడుతుంది అంతే. మీరు ఏదో లోకం లో ఉన్నట్టు నిజాన్ని ఇంకా యాక్సెప్ట్ చేయనట్టు, దానికి అర్థం దాని నుంచి మీరు ఎంత వేగంగా బయట పడితే అంత మంచిది. మీ ఎక్స్ చాలా హ్యాపీగా ఉంటారు. మీరు కూడా ఆనందంగా ఉండడమే మంచిది అంతే కానీ సమయాన్ని వృధా చేసుకోకండి. మీరు నిజాన్ని యాక్సెప్ట్ చేయండి. పైగా వాళ్ళు మూవ్ ఆన్ అయి పోయి కొత్త పార్ట్నర్ తో హ్యాపీగా ఉంటారు. మీ జీవితం మాత్రం ఒక పక్క ముక్కలై పోతూ ఉంటుంది. అలా మీరు ఉండాల్సిన అవసరం లేదు. పైగా ఇది మీ హృదయాన్ని విరిచేస్తుంది. కాబట్టి మీరు చేయవలసిన విషయం ఏమిటంటే...? వాళ్ళ జీవితం కోసం ఆలోచించడం, కలల జ్ఞాపకాలను పదే తలుచుకోవడం, కృంగిపోవడం బాధ పడడం చేయడం వల్ల మీకే నష్టం. కాబట్టి ఇటువంటి వాటిని ఊహించుకుని బాధ లో ఉండి పోకండి. అటువంటి ఆలోచన నుంచి మీరు బయట పడడానికి మాత్రమే ప్రయత్నం చేయండి. అదే మంచి పద్ధతి. కాబట్టి ఇటువంటి ఊహలని మీరు కట్ చేస్తూ ఉండండి. పదే పదే ఊహించుకోవడం గుర్తు చేసుకోవడం వల్ల మీకు ఎటువంటి ప్రయోజనం లేదు. కేవలం దీని వల్ల మీకు నష్టం మాత్రమే ఉంటుంది అని ప్రతి ఒక్కరు గమనించాలి. సెల్ఫ్ అవేర్నెస్ చాలా ముఖ్యం. మీరు ఎప్పుడు కాన్షియస్ గా ఉండాలి. అందరి కంటే పేరు బెటర్ గా ఉండడానికి చూస్తూ ఉండాలి. మీ ఆలోచనలని, మీ ఫీలింగ్స్ ని కంట్రోల్ చేసుకోగలిగి ఉండాలి. మీరు మీ యొక్క ఆలోచనలుని అంత త్వరగా మర్చిపోలేరు అని తెలుసు. కానీ వాటి నుంచి బయట పడటానికి ఒక ప్రయత్నం మీరు చేయాలి. చాలా మంది చేసే తప్పు ఇదే. వాళ్ళ యొక్క ఆలోచనలని వాళ్ళు కట్ చేయకుండా అలా నిమగ్నమై పోయి ఉంటారు. దీని వల్ల ఎప్పటికే బయటపడలేరు. వాటి నుంచి వీలైనంత త్వరగా బయట పడడానికి ప్రయత్నం చేయాలి ఇలా చేయడం వల్ల మీరు మీ యొక్క ఆలోచనా విధానాన్ని మార్చడానికి వీలవుతుంది. అలానే మీ ఎక్స్ ని మర్చిపోవడానికి కూడా సాధ్యం అవుతుందిమరొక విషయం మీరు గుర్తు పెట్టుకోవాలి. అదేమిటంటే మీ మైండ్ కి ప్రపంచంలో దేనినైనా క్రియేట్ చేయడానికి పవర్ ఉంటుంది. మీరు చేసేది మీ మైండ్ మీద ఆధార పడి ఉంటుంది. మీ మైండ్ ని మీరు ఎటు మార్చుకుంటే అది అటు వెళుతుంది. మీరు ఒకసారి మీ మైండ్ తో ఆలోచనలని మార్చుకోవాలి. పదే మర్చిపోవాలి అని చెప్తూ ఉంటే తప్పకుండా మీరు మర్చిపోవడానికి వీలవుతుంది. బ్రేకప్ అయిపోయిన తర్వాత మీరు ఇలా ఆలోచించి వాటి నుంచి బయట పడడానికి ప్రయత్నం చేయండి. నిజంగా మీ మైండ్ ని ఎంత బాగా ట్రైన్ అయితే అంత దాకా మీకు ఒక రిలీఫ్ ఉంటుంది. దీని వలన మీ ఆలోచనలు కూడా అటువైపు వెళ్ళకుండా ఉండడానికి వీలు అవుతుంది. మీ దృష్టిని అటువైపు మళ్ళించకుండా జాగ్రత్తగా మీ పనులు మీరు చేసుకోండి చాలా మంది వాళ్లే మైండ్ ని కంట్రోల్ చేయకుండా పదేపదే బాధపడుతూ ఉంటారు. అలా చేయడం ఎంత మాత్రం మంచిది కాదు. పదే పదే దృష్టి అటువైపు వెళ్ళకుండా చూడమని ట్రైనింగ్ ఇలాంటివి ఇవ్వండి. దీనితో మీరు ఆలోచనల నుంచి బయట పడడానికి అవుతుంది ఒకవేళ మీరు అనుకోకుండా ఆలోచిస్తూ ఉంటే అక్కడికక్కడ తనని కట్ చేసేయండి మీరు చేయాల్సిన పనులు మీద ధ్యాస పెట్టండి. మీ యొక్క ఐదు సెన్సెస్ ని కూడా గమనించండి మీరు ఏం చేస్తున్నారు?, ఏం తింటున్నారు?, ఏ వాసన వస్తుంది..? ఇటువంటి వాటి మీద మీరు ధ్యాస పెడితే తప్పకుండా మీరు అటువైపు వెళ్ళకుండా

# మైగ్రేన్ తలనొప్పి తగ్గట్లేదా..

## ఇవి ట్రై చేయండి..






ప్రస్తుతం పెరుగుతున్న బిజీ లైఫ్ వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. వాటిలో మైగ్రేక్ కూడా ఒకటి. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో మైగ్రేన్ తలనొప్పితో బాధపడే వారి సంఖ్య తక్కువేమీ కాదు. చిన్న వయసులోని వారు కూడా ఈ మైగ్రేన్ తలనొప్పి బారిన పడుతున్నారు. ఈ మైగ్రేన్ తలనొప్పి పలానా కారణం వల్ల వస్తుందని చెప్పడం కష్టమని, ఇది రావడానికి అనేక కారణాలు ఉండొచ్చని వైద్యులు కూడా చెప్తున్నారు. కానీ ముందుగానే కొన్నికొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దీనిని కంట్రోల్ చేయొచ్చని చెప్తున్నారు. అయితే ముందుగా అసలు మనకు వస్తున్నది మైగ్రేన్ తలనొప్పేనా అన్నది తెలుసుకోవాలి. ఈ మైగ్రేన్ తలనొప్పిలో కూడా చాలా రకాలు ఉన్నాయి. నాలుగు రోజులకు మించి తలనొప్పి బాధిస్తున్నా.. వచ్చీ తగ్గుతూ ఉన్నా వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. వైద్యుడు అందించిన మెడికేషన్ వినియోగించడంతో పాటు నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా మైగ్రేన్‌ను కంట్రోల్ చేయొచ్చు. మరి అదెలానో చూసేద్దాం..ఒత్తిడి తగ్గించుకోవడం, బాడీనీ, మెదడును రిలాక్స్ చేసే టెక్నిక్స్ పాటించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, వేళ తప్పకుండా ఆహారం తీసుకోవడం వీటిలో ప్రాథమికంగా, ప్రధానంగా పాటించాల్సినవని వైద్యులు చెప్తున్నారు. అంతేకాకుండా మైగ్రేన్ ఉన్న వాళ్లు చీజ్, నట్స్, ఆల్కహాల్, స్మోకింగ్‌కు దూరంగా ఉండాలి. దాంతో పాటుగా శరీరానికి సరిపడా నిద్ర తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. గోరు వెచ్చని నీటితో స్నానం, యోగా, మెడిటేషన్ కూడా చేయడం మంచిదని వైద్యులు అంటున్నారు. ఇలా జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా మైగ్రేన్ ట్రిగ్గర్ కాకుండా 50శాతం నివారించొచ్చు. వీటన్నింటితో పాటు జ్యూస్‌లకు పెద్దపీట వేస్తూ.. ఆరోగ్యంపై దృష్టి సారించాలి.

# కనుమరుగవుతున్న చేతికర్ర



## బాధపడుతున్న వృద్ధాప్యం



## కాలం చేస్తున్న గాయంగా మారిందంటూ మనోవేదన

### అధునాతనమనే కొత్త పరికరాలతో..

### దోస్తీ చేయలేకపోతున్నామంటున్న వైనం

### అసలైన చేదోడు కోసం పెద్దవాళ్ల ఆవేదన

**ఇదే నిజం, తెలంగాణ బ్యూరో:** చేతికర్ర.. ప్రస్తుత పరిస్థితుల్లో కనుమరుగవుతున్నవాటిల్లో ఇదొకటి. ప్లాస్టిక్ వాడకం, ఇతర పరికరాలను వాడకం వల్ల చేతికర్ర రోజురోజుకు ఆదరణ కోల్పోతోంది. నాటి రోజుల్లో ఉదయం లేచి మొదలు పొలం పనులకు వెళ్లినా, ఇతర పనులకు వెళ్లినా వారి వెంట చేతికర్రను తీసుకెళ్లేవారు. దీంతో వారికి ఎంతో ఉపయోగముండేది. ఒకరకంగా చెప్పాలంటే చేతికర్ర శరీరంలో భాగమనేలా ఉండేది. అంతలా జనాలు వాడేవారు. కానీ, రానురాను చేతికర్ర వాడకం కనుమరుగవుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో చేతికర్ర ప్రాముఖ్యతను గుర్తుచేసుకుంటూ పలువురు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులైతే తమకు అసలైన చేదోడు లేకుండా పోతుందంటున్నారు.



### ఏ ఇంటిలో చూసినా..

అయితే, ఆనాటి రోజుల్లో చేతికర్ర పాత్ర చాలా కీలకమనే చెప్పుకోవాలి. దాదాపుగా ఏ ఒక్కరి చేతిలో చూసినా చేతికర్ర ఖచ్చితంగా కనిపించేది. అప్పటిరోజుల్లో ఎక్కువగా వ్యవసాయం పనులు చేసేవారు. ఈ క్రమంలో చేతికర్రను విరివిగా ఉపయోగించేవారు. పశువుల కాపాల కోసం, బావుల వద్దకు వెళ్లే సమయంలో కానీ, ఇతర అవసరాల కోసం చేతికర్ర తప్పనిసరిగా ఉండేది. మిగతావారు కూడా బాగానే వాడేవారు. ముఖ్యంగా నాటి రోజుల్లో వృద్ధుల చేతుల్లో మాత్రం కర్ర ఖచ్చితంగా ఉండేది. ఆ చేతికర్రను బలంగా ఉండే చెట్టు నుంచి తీసుకుని, వాటిని నిప్పుల్లో కాల్చి, ఎండలో కొద్దిరోజులపాటు ఆరబెట్టి ఆ తరువాత దానిని వాడేవారు. ఇళ్లలో ఇదొక అస్త్రంగా ఉండేది. ఏ ఇంటిలో చూసినా ఏదో ఒక మూలకు చేతికర్ర దర్శనమిచ్చేది. రాత్రి సమయాల్లో చేతిలో చేతికర్ర లేకుండా బయటకువెళ్లేవారు కాదు. ఎవరైనా దాడి చేసినా లేదా ఇతర జంతువులు దాడి చేసినా కూడా కర్ర సాయంతో ఎదురించేవారు. అదేవిధంగా వీటి సాయంతో వాటి దాడి నుంచి తప్పించుకునేవారు. ఇలా క్రమంగా వారికి చేతికర్ర తప్పనిసరిలా మారిపోయింది.



### చేదోడు దూరమవుతుందా..?

వృద్ధులకైతే ఈ చేతికర్ర ఎంతగానో ఉపయోగపడేవి. వయస్సు కారణంగా వారికి నడిచేందుకు శరీరం అంతగా సహకరించదు. దీంతో వారు చేతికర్ర సాయంతో హుషారుగా నడిచేవారు. ఇలా సాయపడుతున్న ఆ చేతికర్ర విరిగిపోకుండా ఎక్కువరోజులు వచ్చేలా వాటిని కాపాడుకునేవారు. ఒకరకంగా చెప్పాలంటే ఒక చంటిబిడ్డను తల్లి ఎలా కాపాడుకుంటదో అదే మాదిరిగా ఈ చేతికర్రలను వృద్ధులు కాపాడుకునేవారు. అంతేకాదు అవి తమకు బలంగా భావించేవారు. ఇంతలా సాయపడే చేతికర్రపై వారికి ఎంతో మమకారం ఉండేది. కానీ, ప్రస్తుత రోజుల్లో చేతికర్రల స్థానంలో ఇతర వస్తువులను వచ్చేస్తున్నాయి. దీంతో వృద్ధులు తమకు అసలైన చేదోడు లేదంటూ ఆవేదన చెందుతున్నారు. చేతికర్రను చూస్తే తమకు ఎంతో భరోసాగా ఉండేదంటూ నాటి రోజులను గుర్తుచేసుకుంటున్నారు.



### ఏదో ప్రత్యామ్నాయం..

కానీ, నేటి రోజుల్లో కర్రవాడకం తగ్గుతూ వస్తోంది. బహుషా భవిష్యత్ లో కర్రవాడకం ఉండకపోవొచ్చని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే నాటి నుంచి కొనసాగుతున్న ప్రతి వస్తువుకు దాని స్థానంలో మరోటి వస్తోంది. వాటిని ఆధునాతనంగా తయారు చేస్తున్నారు. ఇందుకోసం ప్లాస్టిక్, స్టిల్, ఇనుము, ఇతర వాటిని వాడుతున్నారు. ఇలా ప్రతి వస్తువుకు ఏదో ప్రత్యామ్నాయంగా వస్తూనే ఉంది. ఈ క్రమంలో ఆనాటి వస్తువులకు ఆదరణ కోల్పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ చేతికర్ర కూడా ప్లాస్టిక్, ప్లాస్టిక్ పైపులతో చేసినవి, స్టిల్, ఇనుము, ఇతర లోహాలతో చేసినవాటిని ఎక్కువగా వాడుతున్నారు.






## భారత్-న్యూజిలాండ్ మధ్య చరిత్రాత్మక క్రికెట్ సిరీస్

**ఆక్లాండ్,** భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య చరిత్రలోనే అతిపెద్ద ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌కు రంగం సిద్ధమైంది. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1 వరకు దాదాపు 40 రోజుల పాటు కొనసాగే ఈ పర్యటనలో మొత్తం 12 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో ఐదు ఇరవై ఓవర్ల మ్యాచ్‌లు, ఐదు ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్‌లు, రెండు టెస్టు మ్యాచ్‌లు ఉన్నాయి. రెండు దేశాల మధ్య క్రీడా సంబంధాలకు వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ప్రత్యేక సిరీస్‌ను నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఇంత పెద్ద స్థాయిలో ద్వైపాక్షిక సిరీస్ ఎప్పుడూ జరగలేదు. అక్టోబర్ 22న క్రైస్ట్‌చర్చ్‌లో తొలి ఇరవై ఓవర్ల మ్యాచ్‌తో సిరీస్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఐదు ఇరవై ఓవర్ల మ్యాచ్‌లు పూర్తయ్యాక ఒకరోజు అంతర్జాతీయ సిరీస్ ప్రారంభమవుతుంది. నవంబర్ 4న ఆక్లాండ్‌లో తొలి ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్ జరగనుంది. టెస్టు సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్‌లో జరుగుతుంది. రెండో టెస్టు నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు క్రైస్ట్‌చర్చ్‌లో నిర్వహించనున్నారు. న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ప్రధాన మార్కెటింగ్ అధికారి గ్లెన్ క్రిట్‌చెల్లీ మాట్లాడుతూ, ఇది కేవలం క్రికెట్ సిరీస్ మాత్రమే కాదని, రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ప్రతిబింబించే వేడుకగా కూడా నిలుస్తుందని తెలిపారు. భారత్ స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా వంటి ప్రముఖ ఆటగాళ్లు కూడా ఈ పర్యటనలో పాల్గొనే అవకాశం ఉందని, వారి రాకకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. 2019-20 సీజన్ తర్వాత భారత్ న్యూజిలాండ్‌లో పర్యటించలేదు. అయితే ఆ తర్వాత రెండు సార్లు న్యూజిలాండ్ జట్టు భారత్‌లో పర్యటించింది. ఈ నేపథ్యంలో రానున్న ఈ భారీ సిరీస్‌పై ఇరు దేశాల క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



## ప్రజ్ఞానందకు మరో ఘన విజయం

**ఓస్లో,** భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మరోసారి ప్రపంచ చెస్ వేదికపై తన సత్తా చాటాడు. నార్వే చెస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడు మ్యాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించి సంచలనం సృష్టించాడు. క్లాసికల్ విభాగంలో కార్ల్‌సన్‌పై సాధించిన ఈ విజయం ప్రజ్ఞానందకు ఈ ఏడాదిలో రెండో గెలుపు కావడం విశేషం. డబుల్ రౌండ్ రాబిన్ విధానంలో జరుగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో ప్రజ్ఞానంద అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఇప్పటివరకు 12 పాయింట్లు సాధించిన అతడు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ ఏడాది క్లాసికల్ చెస్‌లో కార్ల్‌సన్‌పై రెండుసార్లు విజయం సాధించిన తొలి ఆటగాడిగా ప్రజ్ఞానంద అరుదైన ఘనత అందుకున్నాడు. మ-రోవైపు ప్రపంచ చాంపియన్ డీ గుకేశ్‌కు నిరాశ ఎదురైంది. ఎనిమిదో రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన గ్రాండ్‌మాస్టర్ అలిరేజా ఫిరౌజా చేతిలో ఓటమి పాలయ్యాడు. దీంతో గుకేశ్ పాయింట్ల పట్టికలో దిగువ స్థానాల్లోనే కొనసాగుతున్నాడు. ప్రస్తుతం అలిరేజా ఫిరౌజా 13 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, అమెరికాకు చెందిన గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో 14 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. టోర్నీలో ఇంకా రెండు రౌండ్లు మిగిలి ఉండటంతో పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారింది. ఇక అయిదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన మ్యాగ్నస్ కార్ల్‌సన్ ఈ టోర్నీలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. ఇప్పటివరకు కేవలం 9 పాయింట్లు మాత్రమే సాధించిన అతడు వెనుకబడ్డాడు. మిగిలిన రెండు క్లాసికల్ గేమ్‌ల్లో గెలిచినా అగ్రస్థానానికి చేరుకోవడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. కార్ల్‌సన్‌పై ప్రజ్ఞానంద సాధించిన విజయాల సంఖ్య ఇప్పుడు మూడుకు చేరుకుంది. భారత యువ చెస్ సంచలనం మరోసారి ప్రపంచ దృష్టిని తనవైపు తిప్పుకోవడంతో దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


# ఆఫ్ఘాన్ టెస్టుకు సిరాజ్ ఆడటంపై సందిగ్ధత




**చండీగఢ్,** టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు అందుబాటులో ఉండటంపై అనిశ్చితి నెలకొంది. ఇటీవల ముగిసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో వరుసగా మ్యాచ్‌లు ఆడిన నేపథ్యంలో అతనిపై పనిభారం పెరగడంతో విశ్రాంతి ఇవ్వాలా అనే అంశాన్ని భారత జట్టు యాజమాన్యం పరిశీలిస్తోంది. ఈ విషయంపై వచ్చే రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. జూన్ 6 నుంచి చండీగఢ్‌లోని న్యూ పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ మైదానంలో భారత్, ఆఫ్ఘనిస్థాన్ జట్ల మధ్య ఏకైక టెస్టు ప్రారంభం కానుంది. గుజరాత్ టైటాన్స్ తరఫున ఐపీఎల్ మొత్తం సీజన్ ఆడిన సిరాజ్ ఫైనల్ వరకు జట్టుతో కొనసాగాడు. దీంతో అతనికి విశ్రాంతి అవసరమని వైద్య బృందం, జట్టు నిర్వహణ భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సిరాజ్ జట్టుతో కలిసి చండీగఢ్‌లోనే ఉండి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉన్నాడు. ఒకవేళ సిరాజ్‌కు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయిస్తే, జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ పేసర్ అకీబ్ నబీకి జట్టులో అవకాశం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అకీబ్ నబీ 2025-26 రంజీ సీజన్‌లో 60 వికెట్లు పడగొట్టి తన జట్టును ఛాంపియన్‌గా నిలపడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం నెట్ బౌలర్‌గా భారత జట్టుతో ఉన్న అతడిని ప్రధాన జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. అదే సమయంలో యువ పేసర్ గుర్నూర్ బ్రార్ టెస్టు అరంగేట్రం చేసే సూచనలు కూడా బలంగా కనిపిస్తున్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌పై పూర్తిగా అనుభవంలేని బౌలింగ్ దళంతో బరిలోకి దిగడం సెలక్టర్లకు ఇష్టం లేకపోయినా, సిరాజ్ గైర్హాజరీలో యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ మ్యాచ్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగం కాకపోయినా, భవిష్యత్ సిరీస్‌లకు జట్టును సిద్ధం చేసే దిశగా కీలకంగా మారింది. అనంతరం ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ కూడా జరగనుంది. ఆటగాళ్ల ఫిట్‌నెస్, పనిభార నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి సిరాజ్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. అతడు ఆడతాడా లేదా అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది.

# ఐపీఎల్-2027కు కమిన్స్ దూరమా?

### ఎస్ఆర్‌హెచ్‌లో చర్చనీయాంశం




**హైదరాబాద్,** సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులను ఆందోళనకు గురిచేసే వార్త ఒకటి క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆస్ట్రేలియా స్టార్ పేసర్, ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఐపీఎల్-2027 సీజన్‌కు దూరంగా ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. వచ్చే ఏడాది ఆస్ట్రేలియా జట్టుకు అత్యంత కీలకమైన అంతర్జాతీయ షెడ్యూల్ ఉండనుంది. యాషెస్ సిరీస్, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్, వన్డే ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీలు వరుసగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో జట్టుకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో కమిన్స్ ఐపీఎల్‌కు విరామం ఇవ్వాలని భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నిరంతర క్రికెట్ కారణంగా శారీరక అలసట, గాయాల ప్రమాదం పెరుగుతుందని భావిస్తున్న కమిన్స్, జాతీయ జట్టు బాధ్యతలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. గతంలో కూడా పలువురు ఆస్ట్రేలియా ఆటగాళ్లు అంతర్జాతీయ టోర్నీల దృష్ట్యా ఐపీఎల్‌కు దూరమైన సందర్భాలు ఉన్నాయి. ఒకవేళ కమిన్స్ నిజంగానే ఐపీఎల్-2027లో ఆడకపోతే సన్‌రైజర్స్ హైదరాబాద్ కొత్త కెప్టెన్ ఎంపికపై దృష్టి సారించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న ఇషాన్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించే అవకాశముందని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే కమిన్స్ భవిష్యత్తు, ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్సీపై ప్రస్తుతం అధికారిక స్పష్టత లేదు. ఫ్రాంచైజీ లేదా ఆటగాడి నుంచి ప్రకటన వెలువడే వరకు ఈ వార్తలను ఊహాగానాలుగానే పరిగణించాల్సి ఉంటుంది. ఎస్ఆర్‌హెచ్ అభిమానులు మాత్రం కమిన్స్ జట్టుతోనే కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




## రోహిత్, హార్దిక్‌కు బీసీసీఐ పిలుపు

**న్యూఢిల్లీ,** ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ముందు భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. టీమిండియా సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా వెంటనే బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ శిబిరానికి హాజరుకావాలని బోర్డు ఆదేశించింది. రాబోయే సిరీస్‌కు ముందు ఆటగాళ్ల శారీరక దృఢత్వం, మ్యాచ్ సన్నద్ధతను పూర్తిస్థాయిలో అంచనా వేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల ముగిసిన ఐపీఎల్ సీజన్ అనంతరం రోహిత్ శర్మ విశ్రాంతితో పాటు ఫిట్‌నెస్‌పై దృష్టి సారించగా, హార్దిక్ పాండ్యా గాయం నుంచి కోలుకుంటున్న పరిస్థితిలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఇద్దరికీ జాతీయ క్రికెట్ అకాడమీలో ప్రత్యేక ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టి వారి శారీరక సామర్థ్యాన్ని పరిశీలించనున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌కు ముందు కీలక ఆటగాళ్లు అత్యుత్తమ ఫామ్‌లో ఉండేలా చూడటంతో పాటు జట్టు సమతుల్యతను మెరుగుపరచడమే బోర్డు లక్ష్యంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ క్రికెట్‌లో ముందున్న రద్దీ షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుని ఆటగాళ్ల పనిభార నిర్వహణ, ఫిట్‌నెస్ ప్రమాణాల విషయంలో రాజీపడకూడదని బీసీసీఐ భావిస్తోంది. ఈ క్రమంలోనే రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యాలకు ప్రత్యేక శిబిరంలో పాల్గొనాలని స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# ప్రపంచకప్‌లో భారతీయ మూలాల ముగ్గురు ఆటగాళ్ల సందడి




**న్యూఢిల్లీ,** ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్--2026కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల సంయుక్త ఆతిథ్యంలో జూన్ 11 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. భారత జాతీయ జట్టు ఈ ప్రపంచకప్‌కు అర్హత సాధించకపోయినా, భారతీయ మూలాలున్న ముగ్గురు యువ ఫుట్‌బాలర్లు వేర్వేరు దేశాల తరఫున బరిలోకి దిగనుండటం భారత అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఖతార్ జట్టుకు ఎంపికైన తహ్సిన్ మహ్మద్ జంషీద్ ఈ జాబితాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కేరళలోని కన్నూర్ జిల్లాకు చెందిన మలయాళీ కుటుంబ మూలాలు కలిగిన తహ్సిన్ ప్రస్తుతం ఖతార్ లీగ్‌లో అద్భుత ప్రదర్శనతో గుర్తింపు పొందాడు. కేవలం 19 ఏళ్ల వయసులోనే ప్రపంచకప్ తుది జట్టులో స్థానం సంపాదించడం ద్వారా అతడు అరుదైన ఘనతను అందుకున్నాడు. న్యూజిలాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న సర్‌ప్రీత్ సింగ్ కూడా భారతీయ మూలాలున్న ప్రముఖ ఆటగాడు. పంజాబీ కుటుంబానికి చెందిన ఆయన, న్యూజిలాండ్ తరఫున కీలక మిడ్‌ఫీల్డర్‌గా రాణిస్తున్నాడు. గతంలో యూరప్‌లోని ప్రముఖ క్లబ్‌ల తరఫున ఆడిన అనుభవం కలిగిన సర్‌ప్రీత్, న్యూజిలాండ్ ప్రపంచకప్ అర్హత సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆస్ట్రేలియా జట్టులో చోటు దక్కించుకున్న నిషాన్ వేలుపిళ్లై మరో భారతీయ మూలాల ఆటగాడు. తమిళ కుటుంబ నేపథ్యం కలిగిన నిషాన్, వేగవంతమైన వింగర్‌గా గుర్తింపు పొందాడు. ప్రపంచకప్‌లో ఆడనున్న తొలి తమిళ సంతతి ఫుట్‌బాలర్‌గా ఆయన చరిత్ర సృష్టించనున్నాడు. ఇక భారతీయ మూలాలున్న మరో ఆటగాడు నైలు ఆద్య మేసన్ తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. ఫిట్‌నెస్ సమస్యలు, జట్టు సమీకరణాల కారణంగా అతని పేరు చివరి క్షణంలో జాబితా నుంచి తప్పించబడింది. భారత జట్టు ఈ టోర్నీలో లేకపోయినా, భారతీయ మూలాలున్న ఈ ముగ్గురు ఆటగాళ్ల ప్రదర్శన ప్రపంచకప్ సందర్భంగా భారత అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. వారి విజయాలు ప్రపంచ ఫుట్‌బాల్ వేదికపై భారతీయ వారసత్వానికి మరింత గుర్తింపు తీసుకురావాలని అభిమానులు ఆశిస్తున్నారు.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in